

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :21 సంచిక: 07 హైదరాబాద్ 2021 అక్టోబరు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-**

# మెహెరాబాద్ దర్శనం

## 2021 అక్టోబర్ 7 నుండి ప్రారంభం
## ఉదయం 7 నుండి రాత్రి 7:30 వరకూ

ప్రియతమ అవతార్ మెహెర్‌బాబా సమాధిని 2021 అక్టోబర్ 7 నుండి ప్రతిరోజూ ఉదయం 7 నుండి రాత్రి 7:30 వరకూ బాబా ప్రేమికుల దర్శనార్థం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు తెరచివుంచాలని నిర్ణయించినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐతే, కోవిడ్ మహమ్మారి సంపూర్ణంగా తొలిగిపోలేదు కాబట్టి, గతంలో మాదిరి అవతారునికి పాదాభివందనం ప్రస్తుతానికి సాధ్యమవదన్నారు. సమాధి ప్రధాన వాకిలి ముందు నిల్చుని బాబాని దర్శించు కోవాలని చైర్మన్ కోరారు. దర్శన సమయంలో ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలని, సామాజిక దూరం పాటించాలని అన్నారు. అలాగే, బాబా సమాధి ప్రాంగణంలో వున్న బాబా క్యాబిన్, తదితర ప్రదేశాలన్నీ ప్రేమికులకు అందుబాటులో వుండవని అన్నారు. బాబా సమాధి ప్రాంగణంలో గతంలో మాదిరి ప్రార్థనలు, ఆరతి, పూలదండలు, ప్రసాదం పంపిణీ ఇతరత్రా ఏర్పాట్లు వుండవని తెలిపారు.

## యాత్రీకుల భోజన, వసతి సౌకర్యాలు

**మెహెరాబాద్‌కు విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం 2021 అక్టోబరు 22 నుండి మెహెర్ పిలిగ్రిమ్ రిట్రీట్, దిగువ మెహెరాబాద్‌లో వున్న డి - హాస్టల్‌లో వసతి కల్పించాలని క్రింద పేర్కొన్న నిబంధనలకు లోబడి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.**

1. ఈ హాస్టల్స్ ఒక్కొక్కదానిలో కేవలం 50 మందికి మాత్రమే వసతి ఏర్పాటు. 2. వసతి కేవలం 3 రాత్రులకు మాత్రం పరిమితం. ఆపై పొడిగించడం సాధ్యమవదు. 3. వాక్-ఇన్ బుకింగ్‌లు లేవు. 4. వసతి కోరువారు కనీసం 24 గంటలు నుండి ఒక వారంరోజుల ముందుగా తమ అభ్యర్థనను పంపవలె. 5. యాత్రీకుల వయస్సు 10 సంవత్సరాలు కంటే ఎక్కువ, 65 సంవత్సరాలు లోబడి వుండాలి. 6. కనీసం ఒక దఫా టీకా తీసుకొని వుండాలి. 7. ఆ మేరకు తగిన సర్టిఫికేట్‌ను తమ అభ్యర్థనకు జతపరచాలి. 8. ఆధార్ కార్డు కాపీ లేదా పుట్టినతేదీ గల ఏదైనా ఫోటో గుర్తింపు కార్డును అభ్యర్థనకు జతచేయాలి. 9. సంపూర్ణ ఆరోగ్యవంతులే మెహెరాబాద్‌కు రావల్సిందిగా మనవి. 10. యాత్రికుడు వారి బస సమయంలో అనారోగ్యానికి గురయితే, అవసరమైనవారికి, అహ్మద్‌నగర్‌లోని ఆసుపత్రికి రవాణా సౌకర్య కల్పన. 11. అనేక పరిమితులవల్ల ప్రత్యేక వైద్య సదుపాయం సాధ్యంకాదని మనవి.

***

# బాబా సందేశం

**మనము లోపల లేని దానిని బైటకు ప్రదర్శించరాదు.**

**త్రికరణశుద్ధి రాహిత్యం కంటే మించిన పాపమే లేదు.**

**గౌరవ సంపాదకులు**
**దాక్టర్ మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

## మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. బెయిలీ 6-14
3. తొలి చిత్రం 15
4. మీకు తెలుసా? 16
5. దాగుడుమూతలు 17-19
6. లార్డ్ మెహెర్ 20-25
7. మినూ ఖరాస్ 26-27
8. సద్యః ఫలితం, పుస్తక సమీక్ష 28
9. ప్రప్రథమంగా తీసిన ఫోటో 29 -30
10. మెహెరాబాద్ సహవాస్ 31-35
11. ఈస్ట్-వెస్ట్ గాదరింగ్ 36
12. మా మాటలు 37-38

## మనవి

**ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.**

Please visit : www.srimeherbaba.com

## ఆన్‌లైన్‌లో 53వ అమరతిథి

మెహెరాబాద్‌లో కోవిడ్ వైరస్ సమస్య పూర్తిగా సమసిపోలేదని, ఈ కారణంగా బాబా ట్రస్టు గత ఏడాది మాదిరిగా అవతారుని 53వ అమరతిథిని 2022 జనవరి 30 నుండి ఫిబ్రవరి 1 వరకూ ఆన్‌లైన్‌లో వర్చ్యువల్‌గా నిర్వహిస్తున్నట్లు బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులందరూ స్థానిక బాబా సెంటర్లలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అమరతిథిని జరుపుకోవల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆంధ్రా రెస్టు హౌస్

మెహెరాబాద్‌కి విచ్చేసే యాత్రీకులకు ఆంధ్రా రెస్టు హౌస్‌లో భోజన, వసతి ఏర్పాట్లు 2021 నవంబరు రెండవవారం నుండి ప్రారంబించనున్నట్లు కార్యదర్శి శ్రీ వైయస్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, పరిమిత సంఖ్యలో యాత్రీకులకు వసతి సౌకర్యం కల్పించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ శ్రీనివాస్ (99121 99978) సంప్రదించగలరు.

## కారులో మెహెరాబాద్‌కి...

మెహెరాబాద్‌కు సొంతకార్లలో వెళ్ళేవారికి ప్రధానంగా మూడు మార్గాలున్నాయి.

### రూట్ -1

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - తుల్జాపూర్ - ఉస్మానాబాద్ - భూమ్ - జామ్‌ఖేడ్ - అహ్మద్‌నగర్ - మెహెరాబాద్ (515 కిమీ)

### రూట్ -2

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - షోలాపూర్ - టింబర్ని - జేవూర్ - కర్మాలా - మీరజ్ గావ్ - ఆరంగం గావ్ - మెహెరాబాద్ (552 కిమీ)

### రూట్ -3

హైదరాబాద్ (కోఠి) - పటాన్‌చెరువు - సంగారెడ్డి క్రాస్ రోడ్స్ - జహీరాబాద్ - హుమానాబాద్ - ఉమర్‌గా - నల్‌దుర్గ్ - షోలాపూర్ - టింబర్ని- డోండ్ - మెహెరాబాద్ (530 కిమీ).

# సంపాదకీయం అవగాహన అత్యవసరం

హైదరాబాద్‌లోని ఖాజాగుడ గుహలో మెహెర్‌బాబా 1951 అక్టోబరు 16 నుండి 24 వరకూ ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమం చేపట్టారని పాఠకులకు తెలుసు. బాబా మనోనాశ్ కార్యక్రమం చేపట్టి నేటికి 70 సంవత్సరాలు నిండుతున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగా 2021 అక్టోబరు 17న ఖాజాగూడాలో పెద్దఎత్తున సహవాస్ కార్యక్రమం నిర్వహించారు. ఒకప్పుడు ఇక్కడకు వెళ్ళాలంటే బండ రాళ్ళ నడుమ నుంచి నడిచి వెళ్ళవల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. కొండపై దాకా కారులో వెళ్ళేందుకు చక్కటి రోడ్డు వేశారు. సహవాస్ ఏర్పాటుకు వేదికను ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం ఉదయం సత్సంగ్ నిర్వహిస్తున్నారు. అవతారుడు ఏకాంతవాసం నిర్వహించిన గుహను వీలున్న సమయంలో దర్శించుకునే ఏర్పాట్లు చేశారు. ఇదంతా నేటి తరం యువతకు అవతారుడు కల్పించిన గొప్ప అవకాశమని భావించాలి. గత ఏడు దశాబ్దాలలో మనోనాశ్ గుహ సమీపంలో వచ్చిన మార్పు అనూహ్యం. నగర శివార్లలో వుండే ఈ కొండ ప్రాంతం నేడు అత్యంత ధనికులు మాత్రమే నివసించగల ఆవాసంగా అభివృద్ధి చెందింది.అవతారుని పాదస్పర్శ వల్లనే ఈ సాధ్యమైందని బాబా ప్రేమికులు అంటారు. “హైదరాబాద్ అంటే నాకెంతో ఇష్టం అన్నారు మెహెర్‌బాబా. ఈ నగరం ఆధ్యాత్మికతకు ఆలవాలం అన్నారు. మెహెర్‌బాబా హైదరాబాద్‌ను ప్రప్రథమంగా 1930 ఆగస్టు 29న సందర్శించారు. 1956 సెప్టెంబరు 8 చివరిసారిగా మస్తుల అన్వేషణలో భాగంగా బాబా ఇక్కడికి వచ్చారు. ఆ మాదిరిగా 1930 నుండి 1956 నడుమ మెహెర్‌బాబా హైదరాబాద్‌ను తొమ్మిదిసార్లు పర్యటించారు.మొత్తం 360 రోజులు బాబా ఇక్కడ బస చేశారు. భాగ్యనగరంలో బాబా 70 మంది మస్తులతో సాంగత్యం చేశారు. అత్యధిక మస్తులున్న ప్రాంతమిదన్నారు. 1951 మే 27 నుండి ఆక్టోబరు 24 వరకూ జూబ్లి హిల్సులో “కోహినూర్” అనే బంగళాను ఆరు నెలలపాటు అద్దెకు తీసుకున్నారు. అప్పటికి బాబా నవజీవనం చేపట్టి సుమారు రెండేళ్ళు నిండుతోంది. ఈ సమయంలోనే 1951 జూన్ 28 నుండి 30 వరకూ ప్రత్యేక సహవాస్‌ని ఇక్కడ నిర్వహించారు. బాబా నవజీవనం, మనోనాశ్ కార్యక్రమాల విశిష్టతపై సహవాసీలకు చక్కని వివరణ ఇచ్చారు. ఇంతటి విశేషత గల జూబ్లి హిల్సు బాబా కేంద్రం, ఖాజాగూడా మనోనాశ్ గుహలకు సంబంధించి ఆధ్యాత్మిక జిజ్ఞాసువులందరికి తెలియజేయ్యాల్సిన అవసరం వుంది. ముఖ్యంగా రెండు మూడేళ్ళ కొకసారైనా మెహెరాబాద్‌కు విచ్చేసే దేశవిదేశాల్లో వున్న అనేకమంది బాబా ప్రేమికులు హైదరాబాద్‌లోని ఈ పవిత్ర ప్రాంగణాలను సందర్శించేలా తగిన అవగాహన కల్పించాలి. ఇందుకు ప్రతి బాబా ప్రేమికుడు బాధ్యత చేపట్టాలి!!. **ఇది అత్యవసరం !!** *

# బెయిలీ

## మెహెర్‌బాబా చిన్ననాటి స్నేహితుడు




ఈయన పూర్తిపేరు బెయిలీ జంషెడ్ ఇరాని. బెయిలీ మెహెర్‌బాబాకు చిన్ననాటి స్నేహితుడు. మెహెర్‌బాబా పూణేలోని ససూన్ ఆసుపత్రిలో జన్మించారని పాఠకులకు తెలుసు. మెహెర్‌బాబా పుట్టిన కొన్ని రోజుల తర్వాత, అదే ఆసుపత్రి, అదే వార్డులో, కేవలం కొన్ని రోజుల తేడాతో అంటే 1894 మార్చి 21న బెయిలీ జన్మించాడు.ఆ రోజు జొరాస్ట్రియన్‌ల నూతన సంవత్సరం –"నవ్రోజ్" అయింది. బాబా కంటే బెయిలీ కేవలం కొన్ని రోజులు చిన్నవాడు. బాబావారి ఇంటి సమీపంలోనే బెయిలీ వారి ఇల్లువుండేది. బాబాతో కలిసి స్కూల్లో చదువుకున్నాడు. ఐతే చిన్నతనం నుండి బెయిలీ అహంభావి. తలబిరుసుగలవాడిగా ప్రతీతి. బహు బద్ధకస్తుడు. చీటికిమాటికి అనవసరమైన విషయాల గురించి వాదులాడే మనస్తత్వం గలవాడు. ఇది ఆతనికి చిన్ననాటి నుండి అబ్బిన అవలక్షణాలు. మెహెర్‌బాబా యొక్క స్వచ్ఛమైన పాత్రకు భిన్నమైన జీవనశైలి బెయిలీది. అందువల్లనే బాబా మండలిలో తాను శాశ్వతంగా ఇమడలేకపోయానని బెయిలీ స్వయంగా పలు సందర్భాలలో చెప్పుకున్నాడు. బాబాకు అత్యంత సన్నిహితంగా వుంటూనే, పలుమార్లు మండలివారి నుండి దూరంగానూ వున్నాడు. ఆయన తన వ్యక్తిగత జీవితంలో ఎన్నో హెచ్చుతగ్గులు చవిచూశాడు. జీవిత చరమాంకంలో బాబా మండలివారి నుండి దూరంగా, హైదరాబాద్‌లోని ఒక వృద్ధాశ్రమంలో జీవనం గడిపాడు. ఈ సమయంలోనే అంటే 1965లో, 71 సంవత్సరాల వయస్సులో అవతారునితో గల తన జ్ఞాపకాలను గుజరాతీ భాషలో గ్రంథస్తం చేశాడు. తన చిన్నతనంలో బాబాతో గడిపిన ఆ మధుర స్మృతులను సుమారు ఆరు డైరీలలో రాశాడు. బాబా ప్రేమికుడైన డాక్టర్ హొషాంగ్ భరూచా (నవసారి) బెయిలికి మంచి స్నేహితుడు. బెయిలీ తాను రాసిన డైరీలను డాక్టర్ భరూచాను భద్రపరచమని ఇచ్చాడు. ఆ పిదప, బెయిలీ డైరీలను నవసారీలోనే వున్న మరో బాబా ప్రేమికుడు ఏరుచ్ బుహారీవాలాకు డాక్టర్ భరూచా ఇచ్చాడు. ఈయన ఈ డైరీలను ఆసాంతం చదివి, వాటిని ఇంగ్లీషులో అనువదించడానికి ప్రయత్నించాడు. ఈ అనువాద ప్రక్రియలో ముంబాయిలోని

బాబా ప్రేమికుడైన సైరస్ ఖంబాటాను సంప్రదించాడు. వీరిద్దరూ కలిసి కొన్ని రోజులపాటు శ్రమించి, గుజరాతీలో వున్న అంశాలను ఇంగ్లీషులోకి అనువదించారు. ఏరుచ్ బుహారీవాలా వయస్సురీత్యా వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతునప్పుడు, శ్రీ సైరస్ బాబా ప్రేమికులైన కిషోర్ మిస్త్రీ, ఆ తర్వాత ఆయన సోదరుడు రజనీకాంత్ మిస్త్రీల సహాయం తీసుకున్నట్లు శ్రీ సైరస్ తెలిపారు. సుమారు 10 సంవత్సరాలు కృషి చేసి **"బెయిలీ మధురస్మృతులు"** పేరిట అవతార్ మెహెర్‌బాబా బొంబాయి సెంటర్ వారు చిన్న పుస్తకంగా 2018 ఫిబ్రవరి 25న, అవతారుని 124వ జన్మదినం సందర్భంగా ప్రచురించి బాబా ప్రేమిక పాఠకలోకానికి సవినయంగా అందజేశారు. బెయిలీ ఒక ఆదర్శవంతమైన మండలి సభ్యుడు కాదని పలువురి అభిప్రాయం. ఈ విషయాన్ని బెయిలీ మహాశయుడే స్వయంగా తన గురించి చాలా విశదంగా చెప్పుకున్నాడు. మెహెర్‌బాబాకు తొలితరం శిష్యుడినన్న మాటేకానీ, తనకూ – బాబాకు నడుమ "ఆస్మాన్ జమీన్ ఫరక్" (ఆకాశానికి భూమికి నడుమ ఉన్నంత తేడా) ఉందన్నాడు. మెహెర్‌బాబా దైవాంశ సంభూతుడయితే, తనను ఒక సైతాన్‌తో సరిపోల్చుకున్నాడు బెయిలీ. ఇలా అనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదన్నాడు బెయిలీ. అటువంటి వ్యక్తి గురించి ముంబాయి బాబా కేంద్రం వారు ప్రత్యేక ప్రచురణ చేపట్టడం సమంజసమా? అలాగే, మెహెర్‌బాబా మాస పత్రిక తిరిగి అటువంటి వ్యక్తి గురించి పత్రికలో ప్రచురించాల్సిన అవసరముందా? అనే ప్రశ్న అడిగేవారు తప్పక వుంటారు.

## మా సమాధానం

బెయిలీ తన డైరీలలో తన గురించి రాసుకున్న పరిచయ వాక్యాలలో..

"నేను దేవుడికి చిన్ననాటి స్నేహితుడిని మాత్రమే కాదు, ఆయన జన్మించినప్పటి నుండి ఆయన వెన్నంటి వున్నవాడినని సగర్వంగా ప్రకటించుకున్నాడు. నా జీవిత చరమాంకంలో, సూర్యాస్తమయ సంవత్సరాలలో, 71 సంవత్సరాల వయస్సులో, బాబా నుండి దూరంగా వుంటూ, ఆనాడు బాబాతో వున్న నా జ్ఞాపకాలను మీ ముందుంచుతున్నాను. బాబా నుండి నేను దూరమైనా బాబా నన్నెప్పుడూ వదిలిపెట్టలేదు. అనుక్షణం ఆయన నా వెన్నంటి వున్నాడన్న అనుభవం నాకుంది. నాకు అవసరమైన ప్రతి సహాయాన్ని తనదైన శైలిలో బాబా నాకందించాడు. బాబా జీవితచరిత్రను గుజరాతీలో రాయాలని చాలాకాలం కలలుగన్నాను. కానీ అది ఫలప్రదం కాలేదు. బాబావారి ఆదేశాల మేరకు, బాబా ఇచ్చిన స్ఫూర్తితో సద్గురువు ఉపాసనీ మహరాజ్, సాకోరి గురించి నేను రెండు పుస్తకాలు గుజరాతీలో రాశాను. బెయిలీ రాసిన డైరీలలో మెహెర్‌బాబా గురించి, ఆయన సన్నిధిలో వున్న

సమయంలో జరిగిన అనేక అరుదైన సంఘటనలను వున్నదివున్నట్లుగా ఆ డైరీలలో ప్రస్తావించాడు. అవతార్ మెహెర్‌బాబా బొంబాయి సెంటర్ "బెయిలీ మధురస్మృతులు" పేరిట ఒక పుస్తకంగా ప్రచురించక పోతే, ఆ సంఘటనలు కాలగర్భంలో కలిసిపోయే అవకాశం వుంది. బెయిలీ డైరీలు ఒక విశేష సమాచారం గల నిధి. ఇంతపరకూ అరకొరగా వున్న సమాచారాన్ని ఆ చిన్న పుస్తకంలో బొంబాయి బాబా సెంటర్ ప్రచురించి వెలకట్టలేని కానుకగా బాబా ప్రేమికలోకానికి అందజేశారు. తెలుగు బాబా ప్రేమికులందరికీ తెలియజేయాలనే ఉద్దేశ్యంతో బెయిలీ ఎలాంటివాడైనా, ఆ పుస్తకంలోని కొన్ని అంశాలను ఒక ప్రత్యేక శీర్షికగా తెలుగు స్వేచ్ఛానువాదంలో మెహెర్‌బాబా పాఠకులకు అందజేస్తున్నామని మనవి. **అవతారుని సన్నిధిలో బెయిలీ జ్ఞాపకాలను ఇకపై ఆయన మాటల్లోనే పరిశీలిద్దాం. దయచేసి స్పందించగలరు.**

## మెహెరుని గొప్పతనం

"మనిషి గొప్పతనం ఊయల నుండే తెలుస్తుందన్నది ఆర్యోక్తి.
బాల్యం నుండి బాబా ఆలోచనలు చాలా పవిత్రంగా వుండేవి.
బాబా దగ్గర వున్న సమయంలో చిన్న పిల్లలు కూడా భయభక్తులతో మసులుకునేవారు.
ఆ రోజుల్లోనే, నేనొక బద్మాష్‌గా (అల్లరి చిల్లరి) ప్రతీతి కదా!
ఐనప్పటికి, బాబా సమక్షంలో వుండగా నేను కూడా ఒక్క చెడు మాట చెప్పటానికి సాహసించే వాడిని కాదు. ఈ సందర్భంగా మా చిన్నతనంలో, 1920వ దశకంలో జరిగిన ఒక సంఘటన చెప్తాను. దయచేసి గమనించండి. ఆ రోజుల్లో ప్రతిరోజూ బాబాను దర్శించుకోవడానికై చాలామంది స్థానికులు వచ్చేవారు. ఒకరోజున, బాబా చాలా బిజీగా వున్నారు. నేనయితే, సుమారు ఫర్లాంగు దూరంలో నిల్చుని మరికొంతమందితో కలిసి పిచ్చాపాటి మాట్లాడుతున్నాను. మాటల మధ్య అసందర్భ, అభ్యంతరకర పదాలు దొర్లబోతున్నాయి. అంతే, దూరం నుండి ఒక మండలి సభ్యుడు బాబావారి ఆదేశాలతో పరుగున మా దగ్గరకు వచ్చాడు. అలా వచ్చి, "ఈ అర్థంలేని అసందర్భ మాటల్ని ఆపండి. లేదా మీరందరూ ఇక్కడ్నుండి దూరంగా వెళ్ళండి. మీ ముఖాల్ని నాకు చూపొద్దు" అని బాబావారి ఆదేశాలను తెలియజేసి తిరిగి వేగంగా వెళ్ళిపోయాడు. నేను ఆశ్చర్యపోయాను. అంత చిన్నవయస్సులోనే బాబా సర్వజ్ఞతకి ఇదొక చక్కని ఉదాహరణ. అంతేకాదు, బాబావారికి మధురమైన స్వరం వుండేది. తొలి చూపులోనే అందరి హృదయాలను ఆకర్షించే రూపం ఆయన సొంతం. కుల, మతాలను ఆయనెన్నడూ ఇష్టపడలేదు. ఇతర మతాలను విమర్శించరాదనేవాడు. అన్ని మతాలను గౌరవించాలని ప్రభోదించాడు. అందరూ ఒకే దేవుడి నుండి వచ్చామని బాబా అనేక సందేశాలు ఇచ్చారు. అదే అంశంపై

బాబా అనేక రచనలు కూడా చేశారు. ఆ రోజుల్లో బాబా ఎక్కువగా ఇంగ్లీషు నవలలు చదివేవాడు. అవి ప్రేమ కథలు కాదు. డిటెక్టివ్ నవలలు చదవడం ఇష్టపడేవాడు. **"సెక్స్‌టాన్ బ్లేక్"** అనే రచయిత రాసిన డిటెక్టివ్ మ్యాగజైన్‌లను ఎక్కువగా ఇష్టపడేవాడు. నేను, అలాగే మా స్నేహితులను కూడా ఆ పుస్తకాలను చదవమని ప్రోత్సహించేవాడు. ఆతను చదివిన పుస్తకాలను మాకిచ్చేవాడు. మాక్కూడా ఆ పుస్తకాలు తప్పక నచ్చుతాయనేవాడు. నేనప్పుడు 4 వ తరగతి చదువుతున్నాను. **సెక్స్‌టాన్ బ్లేక్** డిటెక్టివ్ నవలలను క్రమం తప్పకుండా చదవడం వల్ల నాకు ఇంగ్లీష్‌పై పట్టు లభించింది. ఆ రోజుల్లో నేను ఎక్కువగా గుజరాతీ పుస్తకాలను చదవేవాడిని. సెక్టన్ బ్లేక్‌ను గొప్ప రచయితగా ప్రశంసిస్తూ, బాబా ఆతని లండన్ అడ్రస్సుకి ఒక సుదీర్ఘ లేఖ రాశారు. ఆ ఉత్తరాన్ని ఆ మరుసటి నెల

## సెక్స్‌టాన్ బ్లేక్ డిటెక్టివ్ నవలలు

సంచికలో యథాతథంగా **"మెహెర్‌బాబా పేరిట"** బాక్స్ కట్టి ప్రముఖంగా ప్రచురించారు. మెహెర్‌బాబా పేరుతో ప్రచురించిన ఏకైక రచన ఇది. ఎందుకంటే, ఆ తర్వాత్తర్వాత, బాబా తన కలంపేరు **"హూమా"** పేరిట ఇంగ్లీష్, గుజరాతీ, పర్షియన్,ఉర్దూ,హిందీ భాషలలో అనేక కవితలు, ఘజల్స్ రాశారు. హూమా శీర్షికలను పాఠకులు ఎంతగానో ఆదరించారు. బొంబాయి నుండి ప్రచురితమయ్యే **"సాంజ్ వర్తమాన్** – గుజరాతీ పత్రిక, శనివారం సంచికలో బాబావారి కథనం తప్పక వుండేది. ఏ కారణంగానైనా హూమా కవితలు సకాలంలో ఎడిటర్‌కు అందకపోతే, ఆయన స్వయంగా ఎందుకు పంపలేదని వాకబు చేసేవాడు.

నేను కూడా "బెయిలీ" పేరుతో కవితలు ప్రచురణకు పంపేవాడిని. అందుకు బాబా నన్ను ఎంతగానో ప్రోత్సహించారు."మేమిద్దరం కలిసి గుజరాతీలో జంట కవిత్వం రాయాలని బాబావారి కోరిక. ఈ ఆలోచన ఎలావుంటుందని బాబా నన్ను అడిగారు. ఈ మాటతో నేను ఆశ్చర్యపడ్డాను. ఇదెలా సాధ్యం అని అడిగితే బాబా ఏమన్నారో తెలుసాండి. "నేను పద్యం యొక్క మొదటి పంక్తిని వ్రాస్తాను. నీవు రెండవ పంక్తిని సరైన అర్థంతో పూర్తి చేయాలన్నారు. తిరిగి నేను మూడవది రాస్తే, నీవు నాల్గవ పంక్తిని పూర్తిచేయాలన్నారు. అలా కవితలోని సుమారు పన్నెండు పంక్తుల్ని పూర్తిచేద్దామన్నారు. నా సహాయం తప్పక వుంటుందన్నారు.వాస్తవానికి నేను రాసిన అన్ని కవితలను బాబా దిద్దుబాట్లు చేసి ప్రచురణకు పంపేవారు. హూమా పేరిట రాసిన అనేక కవితలు, ఘజల్సు పత్రికలలో ప్రచురించినవి, అముద్రితాలు చాలా వున్నాయి. అవన్నీ చాలాకాలం బాబావారి సోదరుడు జంషెడ్ వద్ద ఉన్నాయి. ఆ తర్వాత ఆతని భార్య దగ్గర బద్రపరిచారు. ఆ తర్వాత వాటిని నాకు ఇచ్చారు. ఐతే,

కొంతకాలం తర్వాత నేను బాబాతో విభేదించి మెహెరాబాద్ ఆశ్రమం నుండి బయటకు వచ్చేశాను. అలా వస్తూ ఆ అమూల్య సంపదను మెహెరాబాద్‌లోనే వదిలి పెట్టాను. ఆ తర్వాత ఆ కవితలు ఎవరి దగ్గరికెళ్ళాయో నాకు తెలియదు. నేనొక సందర్భంలో ఇదే విషయాన్ని బాబాని అడిగితే ఆయనకూడా తనకు తెలియదన్నారు. బాబా యవ్వనంలో రాసిన అనేక ఉత్తమ రచనలు నేడు బాబా ప్రేమికులకు అందుబాటులో లేకున్నాయి. ఇదంతా బాబా ఇచ్ఛ ప్రకారం జరిగిందను కోవాలి. అంతకుమించి ఏం చేయగలం!!.

## నాకెలాంటి దైవీశక్తి లేదు

పూణేలోని ఫెర్గూసన్ రోడ్డులో ఏర్పాటు చేసిన జోపిడిలో జరిగిందీ వాస్తవ సంఘటన. ఇందుకు నేను సాక్షీభూతుడ్ని. ఆమె ఒక గొప్ప ధనవంతురాలు. పూణే నివాసి. బాబాతో మొదటి సమావేశంలోనే, ఆమెకు బాబాపట్ల గురి కుదిరింది. ప్రతిరోజూ ఆమె తన కారులో బాబా దర్శనం కోసం వచ్చేది. తద్వారా జోపిడి దగ్గర బాబావారి కార్యకలాపాలను దగ్గరగా తెలుసుకుంది. కొన్నిరోజులు పోయాక ఆమెకు బాబావారి దైవీశక్తిని పరీక్షించాలనిపించింది. ఒకరోజు తన మనస్సులోని కోరికను బాబాకు చెప్పింది. బాబా తన దైవీశక్తి ద్వారా తన మనస్సులోని మాట చెబితే, తాను బాబాకు శాశ్వతంగా విధేయురాలిగా వుంటానని చెప్పింది. దానికి జవాబిస్తూ **బాబా ఇలా అన్నారు. "నాకు ఎలాంటి దైవీశక్తి లేదు. అలాంటి శక్తియుక్తులున్నాయని తానెన్నడూ ప్రకటించ లేదు. ఎవరైనా తనకలాంటి శక్తివుందని విశ్వసిస్తే, అది కేవలం వారి భ్రమ మాత్రమేనన్నారు. ఆమె కూడా అలాంటి భ్రమలో వున్నట్లయితే, అలాంటి ఆలోచనల నుండి బైటపడమని సలహా ఇచ్చారు".** ఐతే ఆ మహిళ మరింత మొండి పట్టుదలతో వుంటే, ఆమె బాబాపట్ల విధేయతగా వుండాల్సిన పనిలేదు కాని, ఆమె మనస్సులోని మాటను బాబా వెల్లడిస్తే, ఆ తర్వాత రాబోయే మూడ్రోజుల్లో, ఏదో ఒక రోజున, ఒక్కసారి మాత్రం తన జోపిడీని చీపురుతో శుభ్రపరచాలని షరతు విధించారు. దానికి, అదేమంత పెద్ద విషయం కాదనుకుంది. తాను తప్పక జోపిడీని చీపురుతో శుభ్రం చేస్తానని ప్రేమికులందరి సమక్షంలో అంగీకరించింది. ఇదేమి చెప్పినంత సులువు కాదని హెచ్చరించారు బాబా. బాగా ఆలోచించమన్నారు. ఒకవేళ వాగ్దానం నెరవేర్చలేకపోతే, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందని హెచ్చరించారు. వాగ్దానాన్ని విరమించుకోవడం ఉత్తమం అని హితవు చెప్పారు. ఐనప్పటికి ఆమె బాబాని పరీక్షించాలనే నిర్ణయించుకుంది. బాబావారి షరతును అంగీకరించింది. దాంతో ఆమెను బాబా దూరంగా తీసుకెళ్ళి, ఆమె చెవిలో ఆమె మనస్సులో వున్నది చెప్పి, బాబా తిరిగి తన ప్రేమికుల వద్దకు వచ్చారు. దాంతో,

ఆమె అవాక్కయింది. భయంతో జోపిడివైపు స్థానువులా నిల్చుండిపోయింది. ఆ దరిమిలా జోపిడీని ఎప్పుడు శుభ్రపరుస్తున్నావ్? అని బాబా ప్రశ్నించారు. ఆ మర్నాడు ఆ పనిని చేపడతానందామె. బాబా మరోసారి ఆమెను హెచ్చరించారు. రాబోయే 72 గంటల్లో, రాత్రి 9 నుండి ఉదయం 6 గంటలు తప్పించి, ఆమె తనకు వీలైన సమయంలో కేవలం ఒక్కసారి జోపిడీని శుభ్రపరచాలన్నారు. కానిపక్షంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలని మరోమారు హెచ్చరించారు.

## పశ్చాత్తాపం వల్ల ఫలితం శూన్యం

ఆ పిదప పశ్చాత్తాపం, క్షమాపణ వేడుకోవడం వల్ల ఏమీ ఫలితం వుండదన్నారు. ఇదేమంత కష్టం కాదని నవ్వుతూ చెప్పిందామె. ఇందులో సిగ్గుపడాల్సింది ఏముంది? మహిళలు రోజువారీగా చేసే పని. ఇది ఏమాత్రం కష్టమైన పనికాదన్నది. అలాగైతే వెంటనే చీపురు తీసుకుంటే బాగుంటుందన్నారు బాబా. ఓ పది నిముషాల కంటే ఎక్కువ టైం పట్టదన్నారు. అలాంటప్పుడు మర్నాడు దాకా వాయిదా ఎందుకన్నారు? ఈ పనిని ఇప్పుడు పూర్తిచేస్తే, ఈ విషయం ఇక్కడతో ముగుస్తుంది. ఐతే, ఆ మర్నాడు సాధారణ దుస్తుల్లో వచ్చి జోపిడీని శుభ్రం చేయడానికే ఆమె మొగ్గుచూపింది. బాబా ఓ.కే. అన్నారు. ఆశ్చర్యకరంగా, రెండు మూడ్రోజులు గడువు గడిచినా, ఆమె తిరిగి జోపిడీ కేసి కన్నెత్తి చూడలేదు. గొప్ప ధనవంతురాలైన ఆమె, జోపిడీలో చీపురు పట్టలేదని బాబా ముందునుండీ హెచ్చరిస్తూనే వున్నారు. ఈ రకమైన పనిని ఆమె ఇష్టపడదని సూచించారు. కాబట్టి బాబా ముందుగా చెప్పినట్లు ఆమె తన బాధను అనుభవించాల్సిందే. **అందుకు మరో మార్గం లేదు.** అదేమాదిరిగా, కొన్ని రోజుల్లోనే ఆమె మతిస్థిమితం కోల్పోయింది. భర్త నుండి దూరమయ్యింది. అనేక కష్టాలను అనుభవించింది. ఆ దరిమిలా నేను ఆమె ఎలాగుందన్న సంగతి గమనించలేదు. ఆ అవసరం కూడా నాకు లేదు కదా!!

## కనికరంలేని శిక్ష తప్పదా?

అవతార పురుషుడైన బాబా మాటని విస్మరిస్తే, అవిధేయత చూపితే, బాబా ఆదేశాలను పాటించకపోతే, ఇదిగో ఇలాంటి కఠినమైన, కనికరంలేని శిక్షను అనుభవించి తీరాల్సిందేనా!! అని మనబోటివారికి తప్పక అనిపిస్తుంది. ఇది నిజం. ఐతే ఇది వాస్తవం కాదు. ఈ విషయాన్నే మనం మరోరకంగా చెప్పుకోవాలి. **"బుద్ధి కర్మానుసారిణి". "విధి బలీయం"** అంటారు కదా. అలాగ, ఇలాంటి వ్యక్తులు ఇలాంటి బాధలు అనుభవించడానికే జన్మిస్తారు. ఇది తెలిసిన సద్గురువులు, ఆ దురదృష్టవంతుల్ని కాపాడే ప్రయత్నంలో, ఏదైనా సరళమైన లేదా కష్టమైన

ఆదేశాలను ఇస్తారు. దీనివల్ల వారికి కొంతమేర నిష్కృతి లభిస్తుంది. ఐతే, వీరు సద్గురువుల మాటల్ని ఖాతరు చేయకపోతే నష్టపోయేది ఎవరు? సద్గురువుకి పోయేదేమి లేదు. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులంటారు కదా!! ఇక్కడా అంతే!! ఇలాంటివారు అనుభవించే బాధల్ని చూసినవారు, సద్గురువుని నిందిస్తారు. ఇది లోక సహజం.

## ఇది నా ఆదేశం

ఒకసారి బొంబాయిలోని ఒక ఇరానీ రెస్టారెంట్‌లో, టీ తాగిన తర్వాత, నేను కౌంటర్‌లో నా బిల్లు చెల్లించబోతున్నప్పుడు, తెలిసినవారొకరు నన్ను మెహెర్‌బాబా అనుచరుడిగా ఆ రెస్టారెంట్ యజమానికి పరిచయం చేశాడు. అతను బాబా గురించి అడుగుతుంటే నేను ఉత్సాహంగా బాబాకు గురించి అనేక విషయాలు చెప్పడం ప్రారంభించాను. ఐతే ఏమయ్యిందనుకున్నారు. ఆ యజమాని ఉన్నఫళంగా బాబాని దూషించ సాగాడు. నాకు కోపం వచ్చింది. నన్ను నేను నియంత్రించుకున్నాను. ఆతను బాబాను తప్పుగా అర్థం చేసుకున్నాడని చెప్పబోయాను. ఐనప్పటికీ, అతను నా మాటల్ని ఆలకించకపోయేసరికి, నేను బిల్లు చెల్లించి, ఆతని దగ్గర్నుండి నాకు రావల్సిన చిల్లర కూడా తీసుకోకుండా, బైటకు వచ్చేశాను. ఆతనికేసి అసహ్యంగా చూసి, తిన్నగా బాబా దగ్గరకు వచ్చాను. బాబా నాకోసం ఎదురుచూస్తున్నారు. జరిగినదంతా బాబాతో చెప్పాను. అందుకు బాబా నవ్వుతూ ఏమన్నారో తెలుసాండి!! "బెయిలీ!! నీవు నిజంగానే పెద్ద తప్పు చేశావ్ అన్నారు. నేను నీ స్థానంలో ఉండి ఉంటే, నేను ఏమి చేసేవాడినో తెలుసా? ఆ ఇరానీతో చేతులు కలిపి మెహెర్‌బాబాపై మరో రెండు వ్యతిరేక విషయాలు చెప్పేవాడినన్నారు. **జరిగిందేదో జరిగింది.** ఇకపై ఆ విషయాన్ని మరచిపొమ్మన్నారు. మరెప్పుడైనా ఇలాంటిది పునరావృతమైతే, నా గురించి మరికొన్ని వ్యతిరేక సంగతులు జోడించి, వారిని సంతోషపెట్టండన్నారు. ఇది నా ఆదేశం అన్నారు. ఆ తర్వాత, మండలివారందర్నీ పిలిచి వారికి కూడా ఈ ఆదేశాలు పాటించమని ఆదేశించారు.ఎవరూ ఊహించని చిత్రమైన ఆదేశాలివి. అదృష్టవశాత్తూ ఈ మాదిరి అనుభవాన్ని తిరిగి నేనెన్నడూ ఎదుర్కోలేదు.

## సోమా దేశాయ్

బాబా ప్రేమికుడు సోమా దేశాయ్, గుజరాత్‌లోని నవసారి నివాసి. వయస్సురీత్యా ఆరోగ్యం క్షీణించడంతో మంచం పట్టాడు. వారి కుటుంబంలో వివాహం నిశ్చయమయ్యింది. సోమా దేశాయ్ కోరిక మేరకు, ఆ వివాహం తేదిని, టైంని బాబానే నిర్ణయించారు. బాబా ఆ వివాహానికి తప్పక హాజరవుతానని చెప్పారు. మరో నాలుగు రోజుల్లో వివాహం వుందనగా, సోమా దేశాయ్ ఆరోగ్యం మరింత

విషమించింది. డాక్టర్లు బ్రతకడం కష్టమన్నారు. ఆ సమయంలో కుటుంబసభ్యులు వివాహాన్ని వాయిదా వేద్దామా? మరో తారీఖు సూచించవల్సిందిగా బాబాను కోరారు. పెళ్ళిని వాయిదా వేయాల్సిన అవసరంలేదన్నారు బాబా. తాను ఆ ఫంక్షన్‌కు తప్పక హాజరవుతున్నానని హామీ ఇచ్చారు. మరో రెండు రోజులు గడిచాయి. మూడోరోజున సోమా దేశాయ్ ఆరోగ్యం కుటుంబసభ్యుల్ని మరింత కంగారు పెట్టింది.

## పతంగ్ తెగిపోయింది

డాక్టర్లు ఆయన బ్రతికే అవకాశం తక్కువని ప్రకటించారు. బాబాకు టెలిగ్రాం పంపారు. **"డోంట్ వర్రీ. ఐయామ్ కమింగ్"** అని క్లుప్తంగా జవాబు పంపారుబాబా. పెళ్ళి రోజున సోమా దేశాయ్ అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. డాక్టర్లు ఆతనికి ఎలాంటి మందులూ అవసరం లేదన్నారు. ఇలావుండగా బాబా తన మండలివారితో పెళ్ళిరోజున మధ్యాహ్నానికల్లా వచ్చారు. కుటుంబ సభ్యులందరికీ బాబా దర్శనం ఇచ్చి, తిన్నగా సోమా దేశాయ్ గదికి వెళ్ళారు. దేశాయ్ నీరసంగా కళ్ళు మూసుకుని ఉన్నాడు. బాబాని చూడటంతో దేశాయ్ నెమ్మదిగా మంచం మీద లేచి కూర్చున్నాడు. ఇదిచూసి అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. చాలారోజులుగా దేశాయ్ ఎవరి సహాయం లేకుండా కూర్చోలేకపోతున్నాడు. ఇది డాక్టర్‌కి తెలిసి ఆయన కూడా ఆశ్చర్యపోయాడు. వైద్యపరంగా ఇది అసాధ్యం అన్నారు డాక్టర్లు. ఇది నిజంగా అవతారుని చమత్కారమే! ఆ పిదప, బాబా తన రెండు చేతులను దేశాయ్ భుజాలపై ఉంచి మెల్లగా మంచంపై పడుకునేలా చేశారు. బాబా తన కుడిచేతిని ఆతని నుదిటిపై ఉంచి ఆశీర్వదించారు. **"ఇప్పుడు నేను వచ్చాను. దేని గురించి బాధపడవద్దు. విశ్రాంతి తీసుకోండి. నా గురించి ఆలోచిస్తూ, నా నామస్మరణలో గడపమని చెప్పి, బాబా సోమా గది నుండి బైటకు వచ్చారు.** సోమా ముఖం ప్రకాశవంతంగా, ఆనందంగా కనిపించింది. మరో రెండు గంటల్లో పెళ్ళి అయిపోతుంది. అప్పటిదాకా దేశాయ్ క్షేమంగా వుండాలని కోరుకున్నారు కుటుంబ సభ్యులందరూ. స్థానికులు చాలామంది "ఏం జరుగుతుందోనని భయపడ్డారు". చివరాఖరుగా,వివాహ శుభ ఘడియ రానే వచ్చింది. వివాహం వేడుకగా ముగిసింది. అందరూ ఆనందంలో మునిగిపోయారు. నూతన వధూవరులు బాబావారి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిని త్వరగా సోమా గదికి వెళ్ళి ఆశీర్వాదం తీసుకోమన్నారు. ఆ సమయంలో సోమా జీవన పోరాటంలో వున్నాడు. నూతన దంపతులు ఆయన పాదాలను తాకినప్పుడు దేశాయ్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. యువజంట చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. ఆ పిదప సోమా మూసిన కళ్ళు తెరవలేదు. ఆ గదిలో నుండి వస్తున్న ఏడుపు బాబాకు వినిపించింది. ఏమి జరిగిందో బాబాకు తెలుసు. బాబా వారందరిని ఓదార్చి, సోమా మరణం గురించి వెంటనే ప్రకటించవద్దన్నారు. వచ్చిన అతిథులు

అందరూ వివాహ భోజనం చేయనీయండి. ఆ తర్వాత ఈ వార్తను చెప్పమన్నారు. చివరిసారిగా దేశాయ్‌ని చూసి బాబా తన మండలితో అక్కడ్నుంచి బయల్దేరారు. **"సోమా చాలా అదృష్టవంతుడు. అతను నాలో ఐక్యమయ్యాడు'' అని బాబా ప్రకటించారు.** ఇది జరిగిన చాలా సంవత్సరాలకు సైరస్ ఖంబతా దేశాయ్ మనమరాలు డాక్టర్ మెహెర్ దేశాయ్‌ని కలిసి, ఆనాటి వివాహ వేడుకల్ని ప్రస్తావించినప్పుడు, మీకెవరికీ తెలియని విశేషం ఒకొటుందని ఆమె ఇలా చెప్పింది. అదేమంటే, పెళ్లి వేడుకలు ముగిశాక, మా కుటుంబ సభ్యులు కొందరు బాబాని కలిసి తమ కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో బాబా ఏమన్నారో తెలుసాండి!! పెళ్లికి నాలుగు రోజుల ముందుగానే, "పతంగ్ (గాలి పటం) తెగిపోయింది. నేను దారాన్ని గట్టిగా పట్టుకున్నా" అన్నారు. జైబాబా.

***

## చివరిగా..,

**1960 జూన్.** బాబా గురుప్రసాద్, పూణేలో వున్నప్పుడు,ఒక రోజున బెయిలీ బాబా దర్శనార్థం వచ్చాడు. బాబాతో చాలాసేపు ఏకాంతంగా వున్నాడు. అప్పటికే బాబావారి మండలి నుండి బైయిలీ దూరంగా వున్నాడు. తన భార్య నుండి కూడా విడిపోయాడు. కడు బీదరికం అనుభవిస్తున్నాడు. బాబా నుండి శెలవ్ తీసుకుంటూ, **"నన్ను క్షమించు బాబా"** అన్నాడు. బాబా అతనికి తన ప్రసాదంగా "ఒక గులాబి" ఇచ్చారు. దాన్ని అతను ఆసాంతం నోట్లో వేసుకున్నాడు. ఆ దరిమిలా బెయిలీ హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఆపై బాబా దర్శనార్థం ఎన్నడూ రాలేదు. హైదరాబాద్‌లో వృద్ధాశ్రమంలో చేరాడు. బాబా శరీరం వదిలేసిన కొన్నాళ్ళకు బెయిలీ కూడా హైదరాబాద్‌లో తనువు చాలించాడు.
**లార్డ్ మెహెర్ 7, పేజి 4141**

## సికింద్రాబాద్ సత్సంగ్‌లో

### శ్రీ నోరి సోదరులు, కోఠి సెంటర్ ఇలా అన్నారు

1960వ దశకంలో సికింద్రాబాద్‌లో వున్న మా ఇంట్లో బాబావారి సత్సంగ్ కార్యక్రమం నిర్వహిస్తూ, ఆ వివరాలను '**నగరంలో ఈ రోజు**" శీర్షికలో ప్రచురణార్థం స్థానిక ఇంగ్లీషు దినపత్రిక డెక్కన్ క్రానికల్‌కు ఇచ్చాం. అప్పట్లో సికింద్రాబాద్‌లోని బోయిగూడా ప్రాంతంలోని **"హోమ్ ఫర్ ది ఏజ్డ్"**లో వుంటున్న బెయిలీ మహాశయుడు క్రానికల్‌లో ఆ వార్తను చూసి, మా ఇంట్లో జరిగిన సత్సంగ్‌లో పాల్గొన్నాడు. ఆనాడు మేం ఆయనతో మాట్లాడాం. మా నాన్న గారితో తన గురించి, బాబాతో తన అనుభవాల గురించి క్లుప్తంగా చెప్పుకున్నట్లు మాకు గుర్తు. ఆ పిదప మేం కలిసినట్లు గుర్తులేదు.

# తొలి చిత్రం



మెహెర్‌బాబా సాకోరిలోని ఉపాసనీ మహారాజ్ ఆశ్రమాన్ని వదిలిపెట్టి తిన్నగా బొంబాయిలోని చౌపట్టిలో వుంటున్న ఆయన సహచర మిత్రుడు మున్ని సాహెబ్ ఇంటికి వచ్చారు. బాబాని చూస్తూనే ఒక ఫోటో తీసుకునేందుకు బాబా అనుమతి కోరాడు మున్షీ సాహెబ్. అందుకు బాబా కూడా ఒక షరుతుపై అనుమతించారు. అదేమంటే ఆ సమయంలో తానెలా వుంటే అదేలాగా ఫోటో తీసుకోవాలన్నారు. బాబా మనస్సు మారకముందే వెంటనే ఒక ఫోటోగ్రాఫర్‌ని తీసుకొచ్చి క్షణాలలో ఫోటోతీసుకున్నారు. ఆ సమయంలో బాబా నేల మీద కూర్చుని తన ప్రక్కనున్నవాళ్ళతో మాట్లాడుతున్నారు. ఫోటోగ్రాఫర్ వెళ్ళిపోయాక, బాబా ఒంటరిగా వున్న సమయం చూసుకుని, కాస్తంత మంచి బట్టలు ధరించినట్లైతే బాగుండేది కదా. నీవు మరింత అందంగా, ఆకర్షణీయంగా కనపడేవాడివి అని అన్నాను. అలా నేల మీద కాకుండా ఏదైనా కుర్చీలో కూర్చునుంటే మరింత బాగుండేదన్నాను. నా ఉచిత సలహా విని బాబా నవ్వుతూ ఇలా అన్నారు. రాబోయే రోజుల్లో తన ఫోటోలను భిన్న కోణాలలో పెద్దసంఖ్యలో ప్రతిరోజూ తీసుకునే అవకాశం వుందన్నారు. వాటిని ప్రపంచంలో ప్రచురించే అనేక పత్రికలు, మ్యాగజైన్లు అచ్చు వేస్తారన్నారు. తన ఫోటోలను లాకెట్లు, కీ చైన్లు, వేలి వుంగరాలు, కోటు బటన్‌లలో అమర్చుకుంటారన్నారు. అనేక చలనచిత్రాలు తీస్తారన్నారు. వివిధ భంగిమల్లో తన చిత్రాలను పెయింటింగ్ చేస్తారన్నారు. పెసర గింజంత సైజు నుండి ఆరడగుల నిడివి దాకా తన చిత్రాలు ముద్రిస్తారని ఆనాడే బాబా జోస్యం చెప్పారు. బాబా అలా అన్నాక నేను మరోమాట మాట్లాడలేదు. ఈ ఫోటో బాబా వారి దృష్టిలో చాలా ప్రత్యేకమైనది. బాబాకు భగవత్ చైతన్యం లభించగానే తీసిన తొలి చిత్రంగా భావిస్తానని, బెయిలీ తన మధుర జ్ఞాపకాలలో పేర్కొన్నారు. ***

# మీకు తెలుసా?



ఈ ప్రక్కన వున్న చిత్రంకు సంబంధించి ఒక అందమైన వాస్తవిక కథనం దాగి వుంది. ఒక ప్రేమికునికి - తన ప్రియతముడికి నడుమ జరిగిన మానసిక సంఘర్షణ అది. దక్షిణాదికే చెందిన ఆ ప్రేమికురాలు తన మానసిక వ్యధను కడు రమ్యంగా, ఉన్నది ఉన్నట్లుగా చెప్పారు. మీకు తెలిసిన కథనాన్ని రాసి పంపితే, మీ పేరిట **2021** అక్టోబరు సంచికలో ప్రచురించగలమని చెప్పాం. ఐతే పాఠకుల స్పందన ఎప్పటిలాగానే వుంది.

***

కాగా, ఈ ఫోటోని **1958** మెహెరాబాద్ సహవాస్ సమయంలో తీసినది. ఇకపోతే ఏ సందర్భం అంటే, **1958** మెహెరాబాద్ సహవాస్‌కి హాజరైన జస్టిస్ సంపత్ అయ్యంగార్ (మద్రాసు) గారి కుమార్తె శ్రీమతి వసుమతికి ఆనాడు బాబా సమక్షంలో జరిగిన ఒక అనూహ్యమైన స్వీయ అనుభూతి. ఈ సంచికతో మెహెరాబాద్ సహవాస్ ధారావాహిక సీరియల్ ముగుస్తోంది. ఈ సమయంలో ఈ శీర్షిక సందర్భోచితంగా వుండటుందని భావిస్తున్నాం. శ్రీమతి వసుమతి ఆనాడు తనకు బాబా సమక్షంలో జరిగిన సంఘటనను చాలా చక్కగా కళ్ళకుకట్టినట్లు తెలియజేశారు. ఆ సమాచారం పేజి **17**లో దయచేసి పరిశీలించగలరు. స్పందించగలరు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం శ్రీ వంకాయల అచ్యుతరావు, నరసరావుపేట రు.**1000/-** విరాళంగా పంపారు.
వీరికి మెహెర్‌బాబా పత్రిక పక్షాన ధన్యవాదములు. జైబాబా.

# దాగుడుమూతలు

**జస్టిస్ సంపత్ అయ్యంగార్, మద్రాసు, మెహెర్‌బాబా పాఠకులందరికీ సుపరిచితుడే. చెన్నైలోని సైదాపేట, బ్రాహ్మణవీధిలో వున్న వీరి ఇంటికి 1930వ దశకం నుండి మెహెర్‌బాబా పలుమార్లు సందర్శించారు. ఆ సమయంలో సంపత్ అయ్యంగార్ గారి పిల్లలు బాబాతో అనేక ఆటలు ఆడుకున్నారు. అవతారుని సేవలో తరించిన ధన్యజీవులు జస్టిస్ సంపత్ అయ్యంగార్, ఆయన కుటుంబ సభ్యులు. సంపత్ అయ్యంగార్ ద్వారా ఆయన బంధు, మిత్రులెందరో బాబా పరిధిలోకి వచ్చారు. ప్రస్తుత శీర్షికలో సంపత్ అయ్యంగార్ గారి కుమార్తె శ్రీమతి వసుమతి బాబా సమక్షంలో జరిగిన ఒక అనూహ్యమైన వాస్తవ స్వీయ అనుభూతిని**
**SHOWERS OF GRACE - AVATAR MEHER BABA - Compiled by: SRI BAL NATU గ్రంథంలో ప్రస్తావించారు.**
**ఆ విశేషాలు ఇకపై శ్రీమతి వసుమతి గారి మాటల్లోనే పరిశీలిద్దాం!!**

***

## 1958లో మెహెరాబాద్ సహవాస్

1958లో మెహెర్‌బాబా మెహెరాబాద్‌లో ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేశారు. నేనూ, మా తమ్ముడు మెహెర్‌నాథ్, అక్కయ్య జయంతి ఆ సహవాస్‌లో పాల్గొనే అదృష్టం మాకు దక్కింది. మా ఇంట్లో అందరికీ మెహెరాబాద్ సహవాస్‌లో అవతారుని సమక్షంలో పాల్గొనాలని వున్నా, మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, మేం ముగ్గురం మాత్రమే ఆ దివ్య సమావేశంలో పాల్గొన్నాం. ఐతే, సహవాస్‌కి హాజరుకాలేకపోతున్న మా కుటుంబీకులు ఏం చేశారంటే, ఒక చక్కని ప్రేమ కానుకను తయారుచేసి, బాబాకు ఒక ప్రత్యేక బహుమతిగా మాతో పంపారు. ఆ ప్రేమ కానుక ఏమంటే, అదొక తెల్లని మృదువైన సిల్కు నూలుతో తయారు చేసిన పొడవాటి హారం.
ఆ హారాన్ని బాబాకు తమ బహుమతిగా అందజేయమని మా మేనత్త శ్రీమతి లక్ష్మి మేము మెహెరాబాద్‌కి బయల్దేరేముందు మా చేతికిచ్చింది. ఈ తెల్లని మృదువైన సిల్కు నూలు హారం మధ్యలో ఎర్రని గులాబీలు ప్రత్యేక ఆకర్షణగా ఎంతో ప్రేమతో, భక్తితో తయారుచేసి, బధ్రంగా ప్యాక్‌చేసి ఇచ్చారు. ఈ సిల్కు నూలు దండని మద్రాసులో వున్న స్త్రీ సదన్ మహిళలు తయారు చేశారు. వీరందరూ సమాజంలో దగాపడ్డ ముదితలు. వీరు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలుగా, పలు రంగాల్లో శిక్షణ ఇచ్చేవారు. మా మేనత్త ఈ సంస్థకు అధ్యక్షురాలుగా వుండేది. 1947లో మెహెర్‌బాబా మద్రాసులోని మా ఇంటికి వచ్చినప్పుడు బాబా స్త్రీ సదన్ కూడా

సందర్శించారు. అక్కడి మహిళలను ఉద్దేశించి ప్రత్యేక సందేశాన్ని ఇచ్చారు. వారికి తన దైవీ ఆశీశ్శులు అందజేశారు. ఆనాడు కూడా స్త్రీ సదన్ మహిళలు ప్రత్యేకంగా తయారు చేసిన ఇలాంటి తెల్లని సిల్కు నూలు హారాన్ని బాబాకు సమర్పించారు. ఈ దండను బాబా ఎంతగానో ఇష్టపడ్డారు. ఆ మహిళల పనితనాన్ని అభినందించారు. అనంతరం, ఈ హారాన్ని తనతో వున్న మండలి ప్రేమికుడు డాక్టర్ విలియం డాంకిన్‌కి ఇచ్చి, లండన్‌లో నిర్వహిస్తున్న బాబా కేంద్రానికి తన బహుమతిగా పంపమన్నారు. కాగా, నేడు అమెరికాలోని మెర్టిల్‌బీచ్‌లోని బాబా చిత్రపటానికి ఆ పూలహారాన్ని అలంకరించారని తెలుస్తోంది.

ఇంతకీ అసలు విషయంలోకి వస్తే, మేం ముగ్గురం ఎంతో ఆనందంగా బాబా సహవాస్‌లో పాల్గొనేందుకు మెహెరాబాద్‌కు చేరుకున్నాం.

బాబాను దర్శించుకోవాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతోంది. 1930వ దశకంలో బాబా మా ఇంటికి ఐదారుసార్లకంటే ఎక్కువగానే వచ్చారు. మేం మద్రాసులో వున్నప్పుడు, మైసూర్, బెంగళూరులలో వున్నప్పుడు కూడా బాబా తన మండలితో మా ఇంటికి వచ్చారు. అప్పుడు మేం చిన్నపిల్లలం. నాకు నాలుగైదేళ్ళుంటాయి. నేనూ, మా తమ్ముడు బాబాతో ఆడుకున్నాం. బాబా మాకు ఎన్నో కబుర్లు చెప్పారు. మాతో ఆటలు ఆడేందుకు బాబా ప్రత్యేకంగా కొంత సమయాన్ని కేటాయించారు. మేం బాబాతో దాగుడుమూతలు ఆడాం. ఆ మధుర స్మృతులు దొంతర్లుగా తెరలు తెరలుగా నా కళ్ళముందు కదులాడుతుండగా, మెహెరాబాద్ మండలిహాలులో బాబా దర్శనార్థం క్యూలో నిల్చున్నాను. నా మనస్సు ఆనందంతో వుంది. నేను బాబాకు చాలాకాలంగా తెలుసు కదా.

## బాబాకు నేను ప్రత్యేకం

చిన్నప్పుడు నాతో ఆడుకున్నారు కూడా. ఇక్కడున్నవారందరికంటే బాబాకు నేను ప్రత్యేకం అనుకున్నాను. నా కన్నా బాబాకు బాగా పరిచయమున్న వారెవరున్నారనుకున్నాను. దర్శనం క్యూ ముందుకు సాగుతోంది. బాబా ఒక్కొక్కరిని ఒక్కోరకంగా దగ్గరకు తీసుకుంటున్నారు. కొందరితో జోక్ చేస్తున్నారు. కొంతమందికి ఆలింగన భాగ్యం ఇస్తున్నారు. కొంతమంది బుగ్గలు నిమురుతూ ముద్దాడారు. ఇదంతా చూస్తూ నా వంతు వచ్చినప్పుడు బాబా నాకేం ఇస్తారో కదా అనుకున్నాను. మేం ఆటల్లో స్నేహితులం కదా!! అలా మదిలో ఆలోచనల తెంపర్లు తెగక మునుపే, మా దర్శనం క్యూ ముందుకు సాగడం, నా వంతుగా బాబా ఎదుట నిలబడటం, ఆయన ఎటో చూస్తుండటం, బాబా మరేదో పనిలో వుండటం, అంతా క్షణకాలంలో జరిగి పోయాయి. ఆ తర్వాత, నా వెనక్కాలవారు నా స్థానంలోకి వచ్చేశారు.

దాంతో, నేను మద్రాసు నుండి బాబా కోసం ప్రత్యేక బహుమతిగా తెచ్చిన హారం ఆ హడావిడిలో బాబా మెడలో ఎలా వేశానో ఏమో!! అంతా అనూహ్యంగా నా ప్రమేయం ఏమీ లేకుండా జరిగిపోయింది. ఆ రోజు మొత్తంలో బాబాను ఒక్కసారే దర్శించుకునే వీలుంది. దర్శనం అయిపోయాక సహవాస్ హాల్లో ఒక ప్రక్కగా కూర్చున్నాను. నా అహంకారాన్ని బాబా దెబ్బతీశారనుకున్నాను. మనస్సు ఛిద్రమైంది. కనీసం చిన్నపాటి పలకరింపు కూడా లేదు. బాబా ఏమీ ఎరగనట్లున్నారు. బాబాది ఇంత కఠిన హృదయమా? అనుకున్నాను. మనస్సులోపల్నుంచి ఉబికి వస్తున్న దుఖాన్ని కళ్ళంబడి బయటకు రాకుండా నిగ్రహించుకున్నాను. ఇంతలో మండలి సభ్యుడు ఏరుచ్ వచ్చి బాబా మెడలోని పూలహారాలన్నింటినీ ఒక్కొక్కటిగా తీసివేశాడు. నేను బాబా మెడలో వేసిన సిల్కు నూలు హారం కూడా తీసివేసి పూలగుట్టపై విసిరేశాడు. దాంతో నా బాధ మరింత ఎక్కువైంది. నేను వేసిన దండను తీసేయడంతో బాబాతో నాకున్న ఆ కాస్త బంధం కూడా తెగిపోయిందనిపించింది. ఇంకా ఎందరో సహవాసీలు బాబా దర్శనార్థం తమ చేతుల్లో పెద్ద పూలహారాలతో క్యూలో నిల్చుని వున్నారు. ఇలా నేను బాధతో పరిపరి విధాలుగా ఆలోచనలతో మునిగితేలుతుంటే, ఆశ్చర్యంగా ఒక గొప్ప చమత్కారం జరిగింది. బాబా మెడలో వున్న పూలదండల్ని ఏరుచ్ ఒక్కొక్కటే తీసివేశారు కదా. ఆలా తీసేసిన పూలదండల గుట్టలోనించి బాబా ఒక దండను తీసివ్వమని ఏరుచ్‌ని ఆదేశించారు. ఏరుచ్ ఒకటి రెండు దండలు తీశాడు. అవి కాదన్నారు బాబా. మరొకటి, మరొకటి చూపించాడు. చివరికి నేను బాబా మెడలో వేసిన తెల్లని సిల్కు నూలు దండను చూపించి అది కావాలన్నారు. బాబా ఆ దండను మెహెరాబాద్‌లో సహవాస్ నిర్వహించినన్ని రోజులూ తన మెడలో ధరించారు. సహవాస్ అయిపోయాక కూడా మెహెరాబాద్ నుంచి తిరిగి సహవాసీలందరూ స్వస్థలాలకు వెళ్తున్న సమయంలో కూడా బాబా ఆ దండతోనే వున్నారు. బాబా దిగువ మెహెరాబాద్‌లో రైల్వే ట్రాక్ దగ్గర నిల్చుని అహ్మద్‌నగర్ నుండి దోండ్ వెళ్ళే రైల్లో వున్న సహవాసీలందరికీ బాబా తన రెండుచేతులూ ఊపుతూ వీడ్కోలు చెప్పారు. ఆనాడు తీసిన ఫోటోలు, చలన చిత్రాల్లో మనకు ఈ దృశ్యం కనపడుతుంది. దీంతో బాబాతో సంబంధం ఎవరికీ ఎన్నటికి తెగిపోలేదని అర్థమయింది. ఈ సంఘటన నా మదిలో చెరగని ముద్ర వేసింది. బాబా నాతో తిరిగి దాగుడుమూతలు ఆట ఆడారనిపించింది. చిన్నప్పుడు ఆడింది వేరు. నేడు పెద్దయ్యాక, పలువురు సహవాసీల నడుమ, తన దివ్యదర్శన సమయంలో, బాబా నాతో దాగుడుమూతలు ఆట ఆడారనిపించింది. దీంతో నాకు మాటలకందనంత నిధి దొరికినంత ఆనందం కల్గింది. అలాగే అవతారునికి తన ప్రేమికులపై వున్న అపారమైన ప్రేమ, ఆయన సర్వజ్ఞత, నాకు ప్రస్ఫుటంగా కనిపించాయి. ***



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: – భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925 నుండి...) – తెలుగుసేత:
శ్రీ మల్లాది రామారావ్, మెహెరాబాద్

(గత సంచిక తరువాయి)

అందాలనగరం మిలాన్.
ఈ నగరం చుట్టు ప్రక్కల ఎన్నో చూడదగ్గ ప్రదేశాలున్నాయి.
ఇక్కడికి దగ్గరే ఆల్ప్సు పర్వతాలున్నాయి.
దేశ విదేశాల నుంచి వస్తుంటారు రోజూ ఎందరో ఈ కొండలు ఎక్కడానికి.
నిటారుగా ఉన్నట్టు ఉండే ఈ పర్వతాలు ఎక్కడం అందరి తరమూ కాదు.
సుమారు 1200 కిలో మీటర్లు విస్తరించిన ఆల్ప్సు చుట్టూ ఎనిమిది దేశాలున్నాయి.
మన ఉభయ గోదావరులంత కూడా లేని ఆ దేశాలు చిన్నవే.
కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.
ఇవి ఫ్రాన్స్, సిట్జర్లాండ్, మొనాకో, ఆస్ట్రియా, జర్మనీ,
లిక్టన్‌స్టైన్, ఇటలీ. వీటన్నింటిలోనూ చెప్పుకోదగ్గది లిక్టన్‌స్టైన్ దేశం.
ఇది ఆల్ప్సు కొండల మధ్యనే వుందనాలి.
ఆస్ట్రియా – స్విట్జర్లాండ్ దేశాల నడుమ వుందీ దేశం.
మన హైదరాబాద్ నగరమంత కూడా ఉండదనుకోండి.
ఈ స్థల ప్రాశస్త్యం ఏమయినా కానీ, ఐరోపా వెళ్ళినవాళ్ళు ఆల్ప్సు పర్వతాలని చూసి రావాలని అంటారు. ఆల్ప్సు చూడకపోతే ఐరోపాకి ఎందుకు వెళ్లినట్లుట అంటారు. ఈ నానుడి చెప్పి కావచ్చు.
మరో అంతరంగిక కార్యక్రమం చెప్పి కావచ్చు,
బాబావారు అందర్నీ ఆల్ప్సుకి తీసుకువెళ్లారు.
మిలాన్ నుంచి మొదటి మజిలీ వరేస్ అన్న వూరు.
అక్కడి నుంచి కొండ ఎక్కడానికి రోప్ వే వంటిది వుంది.
"ఫన్యుక్యులర్" రైలు అంటారు దాన్ని.
ఇటువంటిది హరిద్వార్ దగ్గరా, సిమ్లా దగ్గరా కొండపైకి వెళ్లడానికి మనకి వున్నాయి.
కొండపై నుంచి ప్రకృతి అందాలు చూశారందరూ, ముగ్ధులయ్యారు.
మిలాన్‌కి సాయంత్రం తిరిగి వచ్చాక ఓడెన్ థియేటరుకి వెళ్లారు.

ఇక్కడ రోజూ ఏదో ఒక కార్యక్రమం నడుస్తూ వుంటుంది.
ఒకోసారి నాటక ప్రదర్శన జరిగితే, ఇంకోరోజు సినిమా చూడవచ్చు.
ఈ రెండు కాకపోతే సంగీత విభావరిలో తన్మయం చెందవచ్చు.
ఇంతకి బాబా వారు ఈ థియేటర్‌కి వెళ్లే సరికి అక్కడ ఏ ప్రదర్శన జరుగుతోంది?
ఏదో ఆసక్తికరమైన ప్రదర్శనే అయి వుండాలి.
కానీ చరిత్రకారుడు మనకి ఏవివరం చెప్పలేదు.
ఇంతకీ ఆ వేళ ఆదివారం అక్టోబరు 18వ తేదీ.
రెండురోజులు పోయాక మరో విహార యాత్రకు తీసుకెళ్లారు బాబా వారు
అందర్నీ, ఈసారి దర్శించిన ప్రదేశం పేరు "**కోమో సరస్సు**".
ఉత్తర ఇటలీ ప్రాంతంలో ఆల్ప్స్ పర్వతాలను తాకుతున్న ఈ సరస్సు
'ప్రకృతి సోయగాలకి మంత్రముగ్ధులు కాని వారు వుండరట.
మూడు పాయలుగా చీలి ఇంగ్లీషు అక్షరం 'వై' ఆకారంలో ఏర్పడింది సరస్సు.
దీని దక్షిణ భాగాన వుంది కోమో నగరం.
నిర్మాణ విజ్ఞానానికి పెట్టింది పేరు.
అక్టోబరు 23వ తేదీన టెలిగ్రాం వచ్చింది.
మాల్కం, జీన్‌లు పంపారీ టెలిగ్రామ్.
వీరిద్దరూ ఇప్పుడు హార్మాన్లో వున్నారు. అక్కడికి 19వ తేదీన చేరారు.
ఇంతకీ వాళ్లు పంపిన టెలిగ్రామ్ తెచ్చిన వార్త శుభవార్తే.
మెహెరీశుని రాక కోసం అమెరికా ఎదురుచూస్తోందట.
స్వాగత సత్కారాలకి తగిన ఏర్పాట్లు జరిగాయట.
అంటే మెహెరు ప్రభువు అమెరికా యాత్రకి రంగం సిద్దమయింది.
ఈ యాత్రలో పెద్ద భూమిక మెరిడిత్‌ది.
ఈ మాటని ప్రభువే స్వయంగా చెప్పారు చాలాసార్లు.
అమెరికాలో క్షణం తీరిక వుండదు నీకు అని అతడిని హెచ్చరించారు కూడా.
చురుకుగా పనిచేయాలి నువ్వు అక్కడ. చేయాల్సిన పని చాలా వుంది అని అంటూ,
తమలా అతను కూడా చురుకుగా పనిచేయాలన్నారు.
బిత్తరపోయి చూస్తుంటే, బాబావారు ఆతని భుజం తట్టి నువ్వే చూస్తావుగా" అన్నారు.
ఆపిల్, ద్రాక్ష వంటి పళ్ళు మెరిడిత్‌కి చాలా యిష్టం.
రోజూ ఏదో ఒక పండు తెచ్చేవాడు.
బాబాని తీసుకోమని బలవంతం చేసేవాడు. 'తీసుకో బాబా ఈ పళ్లు.
ఆరోగ్యానికి మంచిది' అనే వాడట. ప్రభువు అతని అభ్యర్థనని సున్నితంగా
త్రోసిపుచ్చే వారు. తమకి పండ్లు యిష్టం వుండవనేవారు.

బాబాజాన్, ఉపాసనీ, సాయిబాబా కూడా పండ్లు యిష్టపడలేదన్నారు.
రామకృష్ణ పరమహంస పండ్లను ఏనాడు తాకలేదట.
ఈ మాటనీ ప్రభువే చెప్పారు.
బాబావారి మాటలు మన మెరిడిత్ మిత్రుడిని బుర్ర గోక్కునేలా చేసేవి.
బుర్రకి పని చెప్పేవాడు. ట్యూబ్ లైటు వెలిగేది.
తెలిసిందిలే నాకు తెలిసిందిలే ఈ బ్రహ్మ రహస్యం అని సంబరపడేవాడుట.
ఇంతకి ఏమి తెలిసిందయ్యా! మహానుభావా అంటే, ఏమనేవాడో తెలుసా?
ఆ, ఏమున్నది. సద్గురువులు ఉత్తమ పురుషులు కదా?
పండ్లలో ఉండే శ్రేష్ట గుణాలన్నీ వాళ్లలోనూ వుంటాయి.
మరిక పండ్లతో పనేముంది' అనేవాడు.
ఈ మాటని ప్రభువు సమక్షంలోనూ మెరిడిత్ అన్నాడట వో రోజున.
నీ మాట నిజమే అన్నారట.
అతగాడు వుబ్బితబ్బిబ్బు అయిపోయాడుట.
ఆరోగ్యానికి, రక్తానికి మంచివి పండ్లు అన్నారు ప్రభువు.
ఈ మెరిడిత్ కథా కాలక్షేపం నుంచి మనం మళ్లీ మిలాన్ నగరానికి వస్తే
ఇరవై అయిదు మధ్యాహ్నం ఎనిండ్ మెహెరీశునికి తేనేటి విందు యిచ్చింది.
పెన్సియోనే ఆగోస్టెనీలో ఆమె నివాసం.
ప్రభువు, ఛాన్‌జీ ప్రభృతులు అందరూ ఆమె నివాసానికి వచ్చారు.
తేనీరు సేవించారు. అల్పాహారం తీసుకున్నారు.
మెహెరీశుని ఆశీస్సులు తీసుకుంది ఎనిండ్.
ఆ సాయంత్రం రైలు ఎక్కారు. రెండు గంటల్లో ఆగింది జినోవాలో.
అది బాబావారి కొత్త మజిలీ.
మిలానో టెర్మినస్ హొటల్లో బస.
జెనీవా పట్టణం, జినోవ నగరం వొకటి అనుకొనేరు.
ఈ రెండూ ఒకటి కాదు.
జెనీవా స్విట్జర్లాండ్ దేశంలో వాచీలకి, బ్యాంకు సౌకర్యాలకి పేరు మోసింది.
మరి ఈ జినోవా ఇటలీ దేశపు నౌకా వాణిజ్య కేంద్రం.
మధ్యధరా సముద్రపు వొడ్డున వున్నది ఈ వూరు.
రోమన్ చక్రవర్తులు ఇటలీ పరిపాలించే సమయానికి
జినోవా జగద్విఖ్యాతమైంది వ్యాపార కేంద్రంగా.
అమెరికాని కనిపెట్టిన చరితార్థుడైన క్రిస్టఫర్ కొలంబస్ ఈ వూరివాడే.
బాబావారు అమెరికా యాత్రకి బయలుదేరింది ఈ జినోవా నుండే.

బాబావారితో పాటు కదిలారు మెరిడిత్, అలీ, ఛాన్జీ తదితరులు.
"ఎస్.ఎస్. రోమా అన్న నౌకలో చేశారీ ప్రయాణం.
అక్టోబరు 27వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకి
రోమా బయలుదేరింది న్యూయార్కు దిశగా.
బాబావారికి కేటాయించిన క్యాబిన్ చిన్నది. బాగా యిరుకుగా వుంది.
కాళ్ళు చాపుకొనే వీలు అంతంత మాత్రమే.
అయితే మర్నాడు కొంచెం విశాలమైన క్యాబిన్ దొరికింది.
అది నేపుల్స్ దాటాక. అక్కడ కాసేపు ఆగింది 'రోమా'.
చాలామంది దిగారు. కొత్తవారు ఎక్కారు. కాస్తంత రద్దీ తగ్గినట్లుంది.
బాబా వారికి కొత్త క్యాబిన్ యిచ్చారు. ప్రభువు ప్రసన్నుడయ్యారు.
ఈ నౌకాయానంలో మెరిడిత్‌కి తారసపడింది వో వనిత.
పేరు – లూయిస్ స్కె. టోరంటో నివాసి.
ఆమెకి ప్రభువు దర్శనం దొరికింది.
మన మిత్రుడి పేరు చెప్పి బాబా వారు అంటే గురి కుదిరింది ఆమెకి.
న్యూయార్కు చేరేలోగా చాలాసార్లు ఆమె ప్రభువును దర్శించింది.
మళ్లీ వొక్కసారి మెరిడిత్ కథా కాలక్షేపం చేస్తే
అతగాడు తల పోటయ్యాడు అందరికీ.
ప్రభువుని, మండలిని నలుగురికి అతగాడు పరిచయం చేసే పద్ధతి
విడ్డూరంగా వుండేది. 'ఈయనే మెహెర్‌బాబా. నా స్నేహితుడు' అంటూ
ప్రభువుని పరిచయం చేసేవాడు.
హొటలు సిబ్బంది అయినా, ప్రభుత్వ అధికారులయినా
మెరిడిత్ పరిచయ వ్యాఖ్యలు మారేవి కావు.
యుగావతారుడు ఇతగాడొక్కడి స్నేహితుడేనా?
ఎంత అహంకారం' అని ఛాన్‌జీకి కోపం వచ్చేది.
కుత కుత వుడికి పోయేవాడు.
ప్రభువాజ్ఞని ధిక్కరించ లేక, మెరిడిత్‌కి పాఠం చెప్పలేక
తన కోపాన్ని దిగమింగుకొనేవాడు.
ఇదేమీ పట్టించుకోని మెరిడిత్, మరో బాంబు పేల్చేవాడు.
"ఛాన్‌జీ, ఆతని ప్రక్కన వున్నాడే ఆ కుర్రాడు, ఆలీ
వీళ్లిద్దరూ నా సేవకులండి' అని పరిచయం చేసేవాడు.
'ఔరా! ఇంత పొగరా ఈ తెల్లదొరకి' అని ఛాన్‌జీ వుడికి పోయేవాడు.
పాపం ఏం చేస్తాడు. ప్రభువే అతన్ని భరిస్తుంటే,

నేనెంత, సర్దుకుపోవాలి ఏలోగాలాగ అనుకొనేవాడు.
మెరిడిత్ ప్రవర్తన బాబా వారు గమనించ లేదా అంటే అవును, కాదు అనలేము.
సర్వాంతర్యామికి తెలియనిది, పట్టనిది ఏదీ లేదు ఈ భూప్రపంచంలో.
కానీ సహిస్తున్నారు. ఆ కారణంగా ఏమీ చేయరు ప్రభువు.
అంటే, మెహెరీశుని ఆంతరంగిక కార్యక్రమములో మెరిడిత్‌కు కూడా పాత్ర
వుందని చెప్పక తప్పదు. ఇతని ద్వారా ముఖ్యులు కొందరు బాబావారి సాంగత్యంలోకి
వచ్చారు ఇంగ్లాండులో. ఆ పని దాదాపు పూర్తి అయింది.
మిగిలిన కాస్తా పూర్తయ్యే వరకూ మెరిడిత్‌ని భరించక తప్పదు.
ఈ మధ్య కొత్త తలపోటు తెస్తున్నాడట.
తమ వునికిని ఎవరికీ చెప్పకండి. గోప్యంగా వుంచండన్నది ప్రభువాజ్ఞ.
కానీ మన మిత్రుడికి అనేమి పట్టవు కదా. అందుకనే కామోసు,
మీకు తెలుసా అంటూ బాబా వారి గురించి నలుగురికీ చెప్తున్నాడు.
అడిగిన వాళ్లకీ, అడగని వాళ్లకీ మెరెడిత్ చెప్తుంటే, పాపం వాళ్లు,
ఛాన్జీ గారి వెంట పడుతున్నారుట. మీరు ప్రభువు వెంట వుంటారు కదా!
ఆయన గురించి చెప్పండి సార్ అంటూ వేధిస్తున్నారట.
ఇది ఎక్కడ గొడవరా బాబూ అంటూ తల పట్టుకొంటున్నాడు ఛాన్ గారు.
మెరిడిత్ గారి నిర్వాకం యిలానే వుంటుందంటాడు చరిత్రకారుడు.
ఈ కథా కాలక్షేపం అంతా జినోవాలో వున్నప్పటిది.
అక్కడ 27వ తేదీన బాబా వారు న్యూయార్కు వెళ్లే "రోమా" అన్న ఓడ ఎక్కారని
చెప్పుకొన్నాము కదా!. ఇహ రేపు బయలుదేరుతామనగా,
అంటే, 25వ తేదీ మధ్యాహ్నం పుర ప్రముఖులు బాబావారి గౌరవార్థం
తేనీటి విందు యిచ్చారు. జిజ్ఞాసువులు, సాధకులు వచ్చారు.
వాళ్లలో వొకాయన అచ్చు మన పాద్రీలా వున్నాడు.
ఈ మాటని ప్రభువే శలవిచ్చారు. అతగాడి పేరు డగ్లస్.
రోమా నౌక సాఫీగా సాగుతోంది. మధ్యధరా సముద్రం దాటింది.
అట్లాంటిక్ సముద్రంలో ప్రవేశించింది. ఇది చాలా పెద్ద సముద్రం.
దీనికంటే పెద్దది పసిఫిక్ సాగరం. అట్లాంటిక్' అన్న మాటకి అర్థం –
సముద్రపు అట్లాసు. గ్రీకు దేశస్థులు ప్రాచీన సాహిత్యంలో ఈ ప్రస్తావన వస్తుందట.
మన ఆఘా అలీ కూడా తలనొప్పి తెస్తున్నాడీ మధ్య.
వీడు మరో మెరిడిత్ అయ్యాడు అని ఛాన్జీ విసుక్కొంటున్నారు.
తరుచూ, వాడి మాటకి ఎవరూ ఎదురు చెప్పకపోవడం, ముద్దు చేయడం,

వాడిని తుంటరి వాడిని చేశాయి. పిలిస్తే పలికే దేవదేవుడు దగ్గర వుంటున్న ఆలీ అలకపాన్పు ఎక్కుతున్నాడు. అల్లరి చేస్తున్నాడు. ఒకోసారి రంకెలు వేస్తున్నాడు. ఛాన్ గారయితే భరిస్తున్నాడు. దీనితో రెచ్చిపోతున్నాడు. ఓ రాత్రి బాబావారు ఉగ్ర నరసింహమూర్తి అయ్యారు. మెహెరీశుని కోపానికి ఛాన్జీ బలయ్యారు. ప్రభువు చితకబాదుతుంటే, పాపం ఛాన్జీ కిమ్మనలేదు. “ఏ తప్పు చేయని నాకా శిక్ష! బాబా!” అంటూ అతను మౌనంగా రోదిస్తుంటే, ఆఘా అలీకి దడ పుట్టింది. నిరపరాధిని యింతగా దండిస్తున్న ప్రభువు తనకేమి శిక్ష వేస్తారో అని భయపడ్డాడు. ప్రభువు కాళ్లపై పడ్డాడు. క్షమించు దేవ దేవా అంటూ ప్రాధేయపడ్డాడు. ఈ దృశ్యం లూయిస్ కళ్లబడింది. ఆమె అప్పుడే వచ్చింది ప్రభువుని చూద్దామని అనిపించిందట. వెంటనే వచ్చేసింది. ఛాన్జీ కంటనీరు చూసి ఆశ్చర్యపడింది. ఇదేమిటి? మెహెరీశుని వెంట నీడలా వుండే వ్యక్తి కంటకన్నీరా? ఏమయింది ఇతగాడికి, మనసులోమాట పైకి అన్నది. ప్రభువు ఏమన్నాడో తెలుసా? పాఠక మహాశయా! వూహించగలరా కనీసం? ఏముందమ్మాయి! మా ఛాన్జీ ఎప్పుడూ యింతే! నేను వొంటరిగా కనిపిస్తే చాలు, బావురుమంటాడు. ఎన్నో ఏళ్లుగా దూరంగా వుంటున్న వాడిలా! అవి కన్నీళ్లు కాదమ్మా! ప్రేమ భాష్పాలు ఆవి. ఛాన్జీ ప్రేమ అమోఘం. క్షణం ఎడబాటుని కూడా సహించలేడు. కన్నీరు పెట్టుకుంటాడు అని బాబావారు అంటుంటే, లూయిస్, “అలాగా!” అనడం, ఆఘా అలీ సిగ్గుతో కుచించుకు పోవడం ఒక్కసారే జరిగాయి. పాపం! ఛాన్జీ గోడు ఎవరూ పట్టించుకొంటారు? అతగాడిని చితకబాదిన ప్రభువే చమత్కారంగా ఏమీ తెలియనట్లు మాట్లాడుతున్నారు. ఇది నాకో కితాబా? మరో మొట్టికాయా? ఛాన్జీకి ఏమీ పాలుపోలేదు. ప్రభువుకి నాపై కోపం లేదు. చిన్నోడికి పాఠం చెప్పాలనే నాపై చేయి చేసుకున్నారు. అందుకనే నా కన్నీళ్లకి కొత్త భాష్యం చెప్పారు మెహెరీశుడు అనిపించింది అంత బాధలోనూ కించిత్ గర్వం వచ్చింది. నన్ను మెచ్చాడు నా ప్రియతముడనుకున్నాడు.

–సశేషం

# శ్రీ కురుగంటి

శ్రీ కురుగంటి వెంకటేశ్వరరావు, రాజమండ్రి బాబా నామస్మరణతో 2021 అక్టోబరు 4న అవతారునిలో లీనమయ్యారని స్థానిక కేంద్ర కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ తెలిపారు. శ్రీ కురుగంటి చక్కగా భజనలు చేశేవారని, జీవితంలో చివరి క్షణం వరకూ అవతారుని నామస్మరణలో తరించిన ధన్యుడని ఆయన అన్నారు.

వార్తా-వ్యాఖ్య

# మెహెరాబాద్‌లో దివ్య దర్శనం

**(మా ప్రతినిధి)**

మెహెరాబాద్‌లో బాబావారి దర్శన భాగ్యం 2021 అక్టోబరు 7 నుండి ప్రారంభించిన సంగతి పాఠకులకు తెలుసు. గత ఏడాదిన్నర నుండి కరోనా వైరస్ కారణంగా మెహెరాబాద్‌లోని బాబా దర్శనానికి అనుమతి లేదు. కాదూ కూడదంటే, దూరంగా నిల్చుని, అల్లంత దూరంలో వున్న కిటీలో నుంచి కనిపించే బాబావారి తైలవర్ణ చిత్రాన్ని చూసేందుకు అనుమతించారు. ఐతే, నేడు ఆ పరిస్థితి లేదు. బాబా సమాధి తలుపులు తెరిచారు. గతంలో మాదిరి సమాధి లోపలికి వెళ్ళేందుకు ఇంకా అనుమతి లేదు. బాబా సమాధి వాకిట నిలబడి బాబాని దర్శించుకోవాలి. ప్రధాన వాకిలికి ఎదురుగా ఒక ఐరన్ మెష్ వున్న చెక్క ఫ్రేంని అడ్డంగా వుంచారు. బాబా సమాధి ఉదయం 7 నుండి సాయంత్రం 7.30 వరకూ తెరచి వుంచుతున్నారు. సమాధి ఎదుట ప్రార్థనలు, ఆరతి, భజన గీతాలాపన వంటివి ఏమీ లేవు. దూరం నుండి అవతారుడ్ని దర్శించుకునే అవకాశం కల్పించారు. ట్రస్టు ఆధ్వర్యంలోని హాస్టల్సు అక్టోబరు 22 నుండి కొన్ని నిబంధనలకు లోబడి తెరుస్తున్నారు. హాస్టల్సు లేని కారణంగా మహారాష్ట్ర జిల్లాలలోని వారు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో ఉదయాన్నే వచ్చి సాయంత్రానికి తమ ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. ముఖ్యంగా అహ్మద్‌నగర్, పూణే, ముంబాయి, అమరావతి, తదితర ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు, సొంత వాహనాలలో బాబా ప్రేమికులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. తెలుగువారి సంఖ్య బహు స్వల్పమేనని చెప్పాలి.

**మేము 2021 అక్టోబరు 14 నుండి నాలుగు రోజులు మెహెరాబాద్‌లో వున్నాం.** ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బాబా దర్శనం చేసుకున్నాం. చల్లని గాలులతో చాలా ప్రశాంతంగా వుంది మెహెరాబాద్. అహ్మద్‌నగర్ పట్టణంలో, అలాగే కొన్ని గ్రామాలలో కరోనా కేసులు అధికంగానే వున్నాయని సమాచార భోగట్టా. ఆరంగాం, మెహెరాబాద్‌లలో కేసుల సంఖ్య పరిమితంగానే వున్నా, ఇంకా కడు జాగ్రత్తగా వుండాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆ కారణంగానే 2022 జనవరిలో అమరతిథి కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లోనే తిలకించవల్సిందిగా ట్రస్టు చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, ఎక్కడివారక్కడ ఆయా బాబా కేంద్రాలలో అమరతిథి నిర్వహించుకోవాలని సూచించారు. కరోనా మహమ్మారి త్వరలోనే సంపూర్ణంగా తొలగిపోవాలని అవతారుడ్ని వేడుకుందాం. అప్పటిదాకా ప్రస్తుత నిబంధనలకు లోబడి మెహెరాబాద్‌లో బాబావారి దివ్యదర్శనం చేసుకోవాలనుకోవడంలో ఇబ్బంది ఏమీ లేదు. **స్వీయ నియంత్రణ అత్యంత ప్రధానం. ఉభయకుశలోపరి.**

# మినూ ఖరాస్

## నీవు వెతుకుతున్న దేవుడు ఇక్కడ ఉన్నాడు



**వాడియా పార్కు దర్శన సమయంలో బాబా పాదాల వద్ద మినూ ఖరాస్**

**1932 జనవరి.**

ఆ రోజుల్లో బాబా నాసిక్‌లో వున్నారు. ఒక రోజున కరాచీ నుండి మినోచార్ నౌసర్వాన్ ఖరాస్ బాబా దర్శనార్థం వచ్చాడు. ఈతడ్ని అందరూ క్లుప్తంగా మినూ ఖరాస్ అని పిలిచేవారు. అప్పుడు ఆతని వయస్సు 22 సం. నాసిక్‌లో పోలీస్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ కోసం వచ్చాడు. మినూకి చిన్నతనం నుండి దైవభక్తి ఎక్కువ. ఆతను జొరాస్ట్రియన్ మతస్థుడు. ఐనప్పటికి, ఆతని గదిలో క్రీస్తు, రాముడు, బుద్ధుడు అనేక ఇతర దేవతామూర్తుల చిత్రపటాలు వుండేవి. దేవుడనేవాడు వున్నాడా? ఉంటే ఎక్కడున్నాడని ప్రశ్నించుకునేవాడు. జీవితం యొక్క పరమార్థం గురించి ఆతను తరచు తర్జన భర్జన పడుతుండేవాడు. ట్రైనింగ్ స్కూల్లో వున్న రోజుల్లోనే ఒక రోజున ఒక మంగలి గడ్డం గీయడం కోసం వచ్చాడు. ఆతను మినూ గదిలో వున్న అనేక దేవుళ్ళ చిత్రపటాలు చూసి, పోలీసు ట్రైనింగ్ స్కూల్లో నీవు ఏంచేస్తుంటావ్ వంటి ప్రశ్నలు వేసి, నాసిక్‌లో, ఇక్కడకు దగ్గర్లోనే వున్న మెహెర్‌బాబా ఆశ్రమాన్ని తప్పక సందర్శించాలని సలహా ఇచ్చాడు. అప్పటికే మినూ "మెహెర్‌బాబా" గురించి విన్నాడు. కొన్ని గుజరాతీ పత్రికలలో మెహెర్‌బాబా ఫోటోని కూడా చూశాడు. ఆ దరిమిలా, 1932 జనవరి 17, ఆ రోజు ఆదివారం అయింది. నాసిక్‌లో సర్కిల్ సినిమా సమీపంలో వున్న బాబావారి ఆశ్రమానికి మినూ వెళ్ళాడు. ముందుగా, అక్కడున్న బాబా మండలి సభ్యులు - రమ్జూ, విష్ణు, ఛాన్జీలను కలుసుకుని, తాను బాబా దర్శనార్థం వచ్చానని చెప్పాడు. వారు ఈ విషయం బాబాకు చెప్పారు.

వారు తగిన ఏర్పాట్లు చేశారు. మినూ ఖరాస్ బాబాతో తన తొలి దర్శన అనుభవం గురించి తన డైరీలలో ఇలా రాసుకున్నాడు. ఇకపై ఆతని మాటల్లోనే ...

"కొన్ని క్షణాలలోనే మెహెర్‌బాబా అని పిలవబడే వ్యక్తి అకస్మాత్తుగా
ఆశ్రమ కాంపౌండ్ వద్దకు వచ్చి నా ముందు నిలబడ్డాడు.
ఆ క్షణంలో, ఆ తొలి దర్శనంలోనే నా మనస్సులో ఇలా అనుకున్నాను. ల
"మినూ! నీవు ఎంతోకాలంగా అన్వేషిస్తున్న భగవంతుడు
నీ ఎదుట వున్నాడనిపించింది". అనంతమైన ఆనందం, పరమానందంతో
దేవుని కోసం నేను చేసే ప్రయత్నాలకి ముగిసినట్లనిపించింది.
బాబా నాపై దృష్టి సారించిన క్షణంలో, నా జీవితంలో మొదటిసారిగా,
నా మొత్తం శరీరంలో ప్రతి అణువణువులో చాలా చిత్రంగా,
మాటల్లో వర్ణించలేనంత అనుభూతిని చవిచూశాను.
మెహెర్‌బాబా తొలిచూపులోనే నా మనస్సు దోచుకున్నాడు అనిపించింది.
ఆ పిదప బాబా "నీకు ఏమి కావాలి?" అని అడిగారు.
నేనేమి మాట్లాడలేదు. మౌనంగా ఉన్నాను.
కానీ,"నువ్వు నిజమైతే, నేను మాట్లాడాల్సిన అవసరం ఏముందనిపించింది.
నేను ఏమి కోరుకుంటున్నానో, దేనికోసం వెదుకుతున్నానో అన్నీ నీకు తెలుసని,
నా మనస్సులోనే అనుకున్నాను. బాబా ఆ రోజుల్లో అక్షరఫలకం వాడుతున్నారు.
బాబా బోర్డు మీద ఇలా వ్రాశారు,
"నేను నీ మనస్సులోని మాటలు పూర్తిగా విన్నాను.
నీవు పుట్టినప్పటి నుండి నీకు దేవుని గురించిన ఆలోచన వుంది.
దేవుని గురించి తెలుసుకోవాలన్న కోరిక వుంది.
డోంట్ వర్రీ. నేను చెప్పినట్లు చేయండి.
**'నేను' అనే పదాన్ని మర్చిపోండి. ప్రతి రాత్రి నా ఆలోచనలతో నిద్రపోండి.**
ఎన్నో జన్మల నుండి నాతో నీ అనుబంధం వుంది.
నీకు నేను చెల్లించాల్సిన రుణాన్ని నేను తీర్చుకోవాలి.
నీవు నన్ను ప్రేమించడమే కాదు, నేను నిన్ను ప్రేమిస్తాను" అన్నారు
సర్వేశ్వరుడైన మెహెర్‌బాబా. ఆ క్షణంలో అవతారుడి నుండి శెలవ్ తీసుకున్నా,
ఆ దరిమిలా, మినూ ఖరాస్ అవతారుని ప్రేమ–సేవలో ఎలా తరించాడో బాబా
ప్రేమికులందరికీ తెలుసు.

***

**ఆన్‌లైన్ లార్డ్ మెహెర్. పేజి. 1349. మరింత సమాచారం కోసం మినూ రాసుకున్న డైరీల ఆధారంగా ప్రచురించిన "ది గాడ్ సీకర్" గ్రంధాన్ని చదవగలరు.**

క్రొత్త పుస్తకం

# సద్యః ఫలితం




**మెహెర్‌బాబా సన్నిధిలో జరిగిన అనేక వాస్తవ జీవిత కథా మంజరి "సద్యః ఫలితం". డాక్టర్ మల్లాది శారద రాసిన** ఈ పుస్తకాన్ని మెహెరాబాద్ అవతారుని సన్నిధిలో విజయదశమి పండుగ రోజున, (2021 అక్టోబరు 15) లాంఛనంగా అవిష్కరించారు. సద్యః ఫలితం అంటే అవతారుడి దరి చేరినవారికి తగిన ఫలితం తక్షణం లభిస్తుందన్న ఉద్దేశ్యంతో ఈ పుస్తకానికి ఆ పేరుపెట్టామని రచియిత్రి పేర్కొన్నారు. **అవతారుడి సర్వజ్ఞతను చాటిచెప్పే సుమారు 40 కథాంశాలతో** ఈ పుస్తకాన్ని ప్రచురించారు. చిన్న కథల రూపంలో అందర్నీ ఆకట్టుకునేలా వున్న ఈ పుస్తకంలోని కథాంశాలన్నీ పాఠకుల్ని ప్రభావితం చేసేలా వున్నాయి. ప్రతి కథా ఒక ఆణిముత్యమే. ఈ నలభై శీర్షికలలో ముఖ్యంగా మండలి సభ్యుడైన ఏరుచ్ చెప్పిన భగవంతుడి సమన్యాయం, మాయ, భగవన్నామ మహిమ, తదితర శీర్షికలు అత్యంత ఆకర్షణీయంగా వున్నాయి. అలాగే, మణిజా చెప్పిన కథాంశాలలో దైవేచ్ఛ, ప్రార్ధన వంటి అంశాలు పాఠకుల మనస్సులో గూడుకట్టుకుని వున్న అనేక అనుమానాలను పటాపంచలు చేసేవిగా వున్నాయి. మండలి ప్రేమికురాలు మన్సారీ మాయి చెప్పిన 'పని రాక్షసుడు' మనస్సుని ఎలా నియంత్రించాలో వివరిస్తుంది. **దైవీ కృప శీర్షిక** చాలా విలక్షణమైనది. బాలనాటు ఈ కథాంశాన్ని వివరించారు. మెహెర్‌బాబా స్వయంగా చెప్పిన విషయాలు – వివాహంతో ఆధ్యాత్మిక ప్రగతి, నిస్వార్ధసేవ, సంస్కారములు, తదితర ప్రవచనములను రచయిత సరళమైన తెలుగులో చక్కగా వివరించారు. ఇంకా ఈ పుస్తకంలో యూరోపులో అవతారుడు పర్యటించిన "అసిస్సీ" తదితర ప్రాంతాలు, గుజరాతి, హిందీలలో వున్న బాబావారి ఆరతులకు తెలుగులో సమానార్థం, ఇతరత్రా చక్కగా పొందుపరిచారు. మెహెర్‌బాబా మాస పత్రికలో డాక్టర్ మల్లాది శారద అడపాదడపా రాసిన కొన్ని కథాంశాలను ఎంపిక చేసుకుని పలువురికి ఈ కథాంశాలు స్ఫూర్తినివ్వగలవన్న ఆశయంతో గ్రంథస్తం చేశానని ఆమె అన్నారు. ప్రతిఒక్కరూ తప్పక చదవవల్సిన పుస్తకం. ప్రతిఇంటా తప్పక వుండవల్సిందీ పుస్తకం. **పుస్తకం ఖరీదు. రూ. 100/-**

**ప్రాప్తిస్థానం: కేరాఫ్ బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్, ప్లాట్ నంబరు 32, జె.జె.నగర్ పోస్ట్, యాప్రాల్, సికింద్రాబాద్ –500 087. మరిన్ని వివరాలకు శ్రీమతి మల్లాది శారద (8309–007935) సంప్రదించగలరు.**

# ప్రప్రథమంగా తీసిన ఫోటో

## బెయిలీ తెలియజేసిన అరుదైన సమాచారం



**మెహెర్‌బాబాకి సంబంధించి** ఎన్నో రకాల ఫోటోలున్నాయి. బాబా పర్యటనలకు సంబంధించి కూడా కొన్ని వేల సంఖ్యలో అవతారుని ఫోటోలు మనకు లభిస్తున్నాయి. బాబాను రిక్షాలో కూర్చోబెట్టి బెయిలీ రిక్షా లాగుతున్న ఈ చిత్రాన్ని అవతారునికి మెహెరాబాద్‌లో తీసిన తొలి చిత్రమని బెయిలీ తన మధుర స్మృతులలో తెలియజేశారు. ఈ ఫోటోకి సంబంధించి మరింత సమాచారం బెయిలీ మాటల్లోనే తెలుసుకుందాం.

***

తొలి రోజుల్లో చాలా కాలం బాబా ఫోటో తీసుకోవడానికి ఇష్టపడేవారు కాదు. ఆ పిదప, బాబా తనతోపాటు ఒకరిద్దరు శిష్యులతో కలిసి ఫోటో తీసుకోవడానికి అనుమతించేవారు. 1920వ దశకంలో బాబా మెహెరాబాద్ ఆశ్రమం ఏర్పాటు చేశాక, దిగువ మెహెరాబాద్‌లో వున్న భవనాలలో పురుష మండలి వుండేవారు. రైలు పట్టాలు దాటాక వున్న చిన్న ఎత్తైన కొండపైన వున్న భవనాలలో స్త్రీ మండలి వుండేది. కాగా, ప్రతిరోజూ బాబా కొండపై నుండి ఉదయం 11 గంటలకు దిగి పురుష మండలి దగ్గరకి వచ్చేవారు. సాయంత్రం 6 వరకూ వుండి తిరిగి ఎగువ మెహెరాబాద్‌కి చేరుకునేవారు. ఇదిఇలావుంటే, కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఎగువ-దిగువ మెహెరాబాద్‌ల నడుమ ఎక్కువసార్లు నడిచి వెళ్ళవల్సి వచ్చేది. దీనివల్ల బాబా శ్రమపడుతున్నారని చెప్పి, ఆ రోజుల్లో కొత్తగా మార్కెట్లోకి వచ్చిన చేత్తోలాగే రిక్షానొకదాన్ని కొనుగోలు చేశారు. ఈ మాదిరి రిక్షాలు కోల్‌కత్తాలో నేటికీ విరివిగా కనిపిస్తున్నాయి. ఈ రిక్షాలో ఈజీగా ఇద్దరు వ్యక్తులు కూర్చోవచ్చు. బాబా ఈ రిక్షాలో కూర్చుంటే ఆయన శిష్యులు ఎవరైనా ఆయన్ని ఎగువ - దిగువ మెహెరాబాద్‌లకు తీసుకువెళ్ళి తీసుకురావడాన్ని తమ అదృష్టంగా భావించేవారు. ఇంతకీ ఈ కొత్త రిక్షా మెహెరాబాద్‌కి రాగానే, బాబా అందులో ఆనందంగా ఎక్కి కూర్చున్నారు. ఐతే అవతారుని తొలి రిక్షా ప్రయాణాన్ని, బాబా శిష్యులలో

ఎవరు ముందుగా వచ్చి ప్రారంభిస్తారు. ఆ రిక్షాని కొండపైకి ఎవరు తీసుకెళ్ళాలని అని ప్రశ్నిస్తే, ఆ నిర్ణయాన్ని శిష్యులు బాబాకే అప్పగించారు. అప్పుడు బాబా నా పేరుని పిలిచి నన్ను గౌరవించారని, నాకు ఆ అవకాశం ఇచ్చారని బెయిలీ తన జ్ఞాపకాలలో రాసుకున్నాడు. నేను వెంటనే రిక్షాకి ముందుకెళ్ళి ఆ బాధ్యతను స్వీకరించి, వేగంగా రిక్షాని లాగుతూ ఎగువ మెహెరాబాద్‌కి చేరుకున్నాను. అవతారుని తొలి రిక్షా ప్రయాణాన్ని తిలకించేందుకు అక్కడ బాబా ప్రేమికులందరూ మా కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో ఫోటో తీసుకుంటామని బాబా అనుమతి కోరితే, అందుకు బాబా అంగీకరించారు. బాబా రిక్షాలో కూర్చునుండగా, నేను రిక్షాని ముందుకు లాగుతున్నట్లుండగా, క్షణాల్లో ఫోటో తీశారు.

ఈ విషయంలో నేను రెండు విధాల అదృష్టవంతుడిని అని బైయిలీ అన్నారు.

1) బాబా కూర్చున్న కొత్త రిక్షాన్ని నడిపించిన తొలి శిష్యుడిగా నేను అదృష్టవంతుడ్ని.

2) ఇది తొలిసారిగా బాబా నాతో తీసుకున్న ఫోటో. ఈ రెంటినీ నా అదృష్టంగా, మరచిపోలేని రోజుగా నేను ఎప్పుడూ గుర్తుంచుకుంటానని బెయిలీ అన్నారు.

***

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా నామం ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పదివేల సైన్యంతో సమానమని గమనించ గలరు. మరిన్ని వివరాలకు 99595-53218 సంప్రదించండి.

***



## బాబాలో ఐక్యం

ఏలూరు బాబా కేంద్ర అధ్యక్షులు శ్రీ పసుమర్తి సత్యనారాయణ స్వల్ప అనారోగ్యంతో 2021 అక్టోబరు 10న బాబాలో ఐక్యమయ్యారని కార్యదర్శి శ్రీ సూరపనేని ఒక ప్రకటనలో తెలిపారు.



చల్లపల్లి కేంద్ర బాబా ప్రేమికుడు శ్రీ నంబూరి శ్రీనివాస్ మెహెర్ 2021 సెప్టెంబరు 17న బాబాలో ఐక్యమయ్యారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని బాబాను ప్రార్థిస్తూ సత్సంగ్ నిర్వహించినట్లు కార్యదర్శి శ్రీ రమణారావు పి.వి. తెలిపారు.

# మెహెరాబాద్
# తెలుగు–గుజరాతీల సహవాస్

**1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ**

ఆ తర్వాత బాబావారి భావి సమాధి ఇంకా ఎవరైనా చూసి వుండకపోతే, తక్షణం సమాధి దర్శనం చేసుకుని దిగువ మెహెరాబాద్‌కి వెళ్ళమని బాబా ఆదేశించారు. సమాధిని దర్శించుకునే సమయంలో గతంలో చెప్పినట్లు మరలా ఇలా అన్నారు. మీరు సమాధి దగ్గర మీ శిరస్సువంచి నమస్కరించేటప్పుడు రెండు ముఖ్యమైన విషయాలు గుర్తుంచుకోమన్నారు.

1) బాబాని హృదయపూర్వకంగా ప్రేమించమన్నారు.
ప్రేమ అంటే బహిరంగ ప్రదర్శన కాదు. నన్ను ప్రేమించడమంటే,
నిన్ను నీవు సంపూర్ణంగా మరచిపోవాలి.
నీవు కనుక ఆ మాదిరిగా ప్రేమించలేకపోతే,
నేనే నిన్ను నా ప్రియతముడిగా ప్రేమిస్తాను.
2). ఇతరుల సంతోషం కోసం, నీ సుఖం, సంతోషాన్ని త్యాగం చేసేందుకు సిద్ధంగా వుండాలి.

ఉదయం 10.30 కల్లా బాబా, సహవాసీలందరూ



దిగువ మెహెరాబాద్‌కి తిరిగి వచ్చేశారు.
దిగువ మెహెరాబాద్‌లో మండలిహాలుకు ఎదురుగా విచ్చేసిన
మహిళా సహవాసీలందరితో బాబా ఫోటో తీయించుకున్నారు.
మహిళలను ప్రాంతాలవారీగా ఏడు బృందాలుగా విభజించారు.
బాబా కొంగును గట్టిగా పట్టుకొనమని మహిళా ప్రేమికులను హెచ్చరించారు.
చిన్న కాగితం మీద వున్న ఫోటోని కాదు,
మీ హృదయాలలో నా చిత్రం పదిలంగా వుండాలని సూచించారు.
ఒక గంట తర్వాత అందరూ సహవాస్ సమావేశహాలుకు చేరుకున్నారు.
బాబా వారిని ఉద్దేశించి ఇలా అన్నారు.
ఎవరూ తనను వ్యక్తిగత ఇంటర్వ్యూలు అడగరాదని హెచ్చరించారు.
ఈ కార్యక్రమం అయిపోగానే అందరూ తమ బసకు వెళ్ళి
వారి లగేజిని సిద్ధం చేసుకోమన్నారు.
రైల్వే శాఖ వారు ఒక శుభవార్త చెప్పారని అన్నారు.
అదేమంటే మెహెరాబాద్ నుండి బొంబాయికి, లేదా వయా బొంబాయి
వెళ్ళేవారందరి కోసం రెండు రైల్వే కోచ్‌లు ఏర్పాటుచేశామని
సమాచారం అందజేశారు. ఆ మాదిరిగా సహవాసీలు బొంబాయికి వెళ్ళేవారు
లేదా ఆంధ్రాకి వెళ్ళేవారు అందరూ దోండ్ రైల్వే స్టేషన్ దాకా ప్రయాణించవచ్చని
అన్నారు. దోండ్ నుండి ఒకరు విజయవాడ వైపుకు, మరొక కోచ్‌లో బొంబాయి
వైపు వెళ్తారన్నారు. ప్రతిఒక్కరూ బాబా ప్రసాదం తీసుకుని వెళ్ళమన్నారు.
ఒక్కొక్క సహవాసీకి నాలుగు లడ్డూలు చొప్పున వారి ప్రయాణానికి ముందు
రోజుననే ప్యాకెట్లు కట్టి సిద్ధం చేశారు. అందరూ ఆనందంగా మీ ఇళ్ళకు వెళ్ళండి.
నేను నా ప్రేమను మీకిస్తున్నాను. నన్ను అధికంగా, ఇంకనూ అధికంగా ప్రేమించాలని
గట్టి నిర్ణయం తీసుకోండి. చివరిసారిగా భజన గీతాలాపన, ఆరతి గానం చేశాక
నేను నా గదికి వెడతాను. మీరెవరూ అక్కడకి రాకండి.
ఆ చుట్టుప్రక్కల తిరుగాడకండి.
మధ్యాహ్నం రెండు గంటలకు నేను ఎగువ మెహెరాబాద్‌కు వెడతాను.
అక్కడ స్త్రీ మండలి వచ్చి నన్ను కలుసుకుంటారు.
సహవాస్ బృందం అందరూ ప్రత్యేక రైల్లో మెహెరాబాద్ నుండి వెళ్ళేటప్పుడు
స్త్రీ మండలిని కూడా నాతో పాటు రమ్మనమని చెప్పాను.
మీరు రైలు బయల్దేరేటప్పుడు మీ అందరికీ గుడ్ బై, వీడ్కోలు చెబుతామన్నారు.
క్రితం వారం జరిగిన సహవాసీలకు ఈ అవకాశం లేదు.



ఒకరకంగా చెప్పాలంటే మీరు వారికన్నా అదృష్టవంతులనే చెప్పాలన్నారు బాబా.
మీరెప్పుడైనా మెహెరా గురించి విన్నారా? అని ప్రశ్నించారు.
ఎవరి దగ్గర్నుంచి సమాధానం లేదు.
జీన్ ఆడ్రియల్ రాసిన పుస్తకం "అవతార్"లో మెహెరా గురించి
ఆమె ప్రస్తావించిందని బాబా గుర్తుచేశారు.
ఇంకా ఆమె గురించి చెప్పాలనుకున్నారు కాని,
తగినంత టైం లేదని మెహెరా గురించి మరింకేమి చెప్పలేదు.
వ్యక్తిగత ఇంటర్వ్యూలు అడగవద్దని ముందుగా బాబా హెచ్చరించినా
ఢాకే ఫాల్కర్, రావ్‌సాహెబ్‌లు మరికొందరు
తమకు బాబాతో కొన్ని క్షణాలు ప్రత్యేకంగా మాట్లాడాలని వుందని అన్నారు.
ఇలా వారు అడగటం బాబాకి నచ్చలేదు. అదే సమయంలో ఇది గాడేకర్ తప్పు
కాదు. ఇటీవల ఆతని స్క్రూ లూజయిందని బాబా చమత్కరించారు.
సుభద్ర ఒక చక్కని ఘజలు గానం చేశింది. ఆ తర్వాత పూణే కేంద్ర భజన
బృందం కొన్ని భజన గీతాలు, ఆరతి ఆలాపించిన తర్వాత ఆనాటి కార్యక్రమం
ముగిసిందని ప్రకటించారు. బాబా లేచి నిలబడ్డారు. సహవాసీలందరికీ నమస్కారం
చెబుతున్నట్లు తన రెండు చేతులూ దగ్గరకు తీసుకున్నారు.
ఆ తర్వాత బాబా కారులో బయల్దేరారు.

ఆ సమయంలో సహవాసీలు చాలామంది కళ్ళంబడి నీళ్ళు పెట్టుకున్నారు.
వారి మధ్య నుండి ప్రియతముడు వెళ్ళిపోతుంటే ప్రేమికులు
తమ బాధను భరించలేకపోయారు.
కలకత్తా నుండి వచ్చిన శ్రీ ఎసియస్ చారి
ఆనాటి సహవాసీల పరిస్థితిని తన రచనలో ఒకచోట ఇలా వర్ణించారు.
గత ఐదు రోజులుగా అవతారుని సన్నిధిలో ఓలలాడిన సహవాసీల ఆనందం, మరో చెంపన బాబాను వదిలి వెళ్తున్నందుకు దుఃఖం వారిని మరింత బాధపెట్టింది. కొంతమందికైతే ఇళ్ళకెళ్తున్నామని, వారి ఉద్యోగాల గురించిన ఆలోచనలు వారిని చుట్టుముట్టాయి. మరికొందరు అవతారుడి నుండి దూరమౌతున్నామన్న బాధను తట్టుకోలేక కళ్ళంబడి నీరు పెట్టుకున్నారు. అందరూ నవ్వుతూ, ఆనందంగా వుండాలని బాబా హెచ్చరించారు. "నన్ను అమితంగా ప్రేమించండి. మీ హృదయాలలో నన్ను నింపి మీతో నన్ను తీసుకెళ్ళండి". కన్నీరు పెట్టుకోవద్దు అని హెచ్చరించారు. బాబా తన కేబిన్‌కి వెళ్ళిపోయారు. సహవాసీలందరూ భోజనానికి వెళ్ళారు. ఐతే తిరిగి వెళ్ళి పోతున్నామన్న దుఃఖంలో ఎవరూ కూడా సరిగ్గా తినలేదనే చెప్పొచ్చు. ఆ రోజున మెహ్రూ యొక్క సోదరి నగ్గు అపస్మారక స్థితిలో వుంది. ఆమె ప్రముఖ వైద్యురాలు. విచ్చేసిన మహిళా సహవాసీలకు అవసరమైతే వైద్యసహాయం అందించేందుకై ఆమె ప్రత్యేకంగా వచ్చింది. ఐతే అనుకోకుండా ఆమే పేషంట్ అయ్యింది. చిన్నతనం నుండి బాబాతో సన్నిహిత సంబంధం ఆమెకుంది. బాబా పరిరక్షణలోనే ఆమె పెరిగి పెద్దదయ్యింది. బాబా ఆమెను తన దగ్గరకి పిలవగానే, ఏడుపు ఆపుకోలేక గట్టిగా ఏడ్చేసింది. మధ్యాహ్నం 2 గంటలకు బాబా ఎగువ మెహెరాబాద్ కొండకు కారులో వెళ్ళారు.
అప్పటికే మెహెరాజాద్ నుండి స్త్రీ మండలి మెహెరాబాద్‌కి చేరుకుంది.
మెహెరాబాద్ నుండి బయల్దేరాల్సిన ప్రత్యేక రైలు సుమారు ఒక గంట ముందుగా అంటే సాయంత్రం నాలుగు గంటలకే మెహెరాబాద్‌కు వచ్చేసింది.
సహవాసీలందరూ తమ బోగీలలో లగేజిలతో ఎక్కేసి, కన్నీళ్ళతో అవతారుని కోసం వెదుకుతున్నారు. రైలు సహవాసీలతో కిటకిటలాడింది. అదే సమయంలో బాబా కారులో తన స్త్రీ మండలితో రైలు దగ్గరకు వచ్చారు. బాబా కారు దిగి నేలపై కాలు మోపగానే, సహవాసీలందరూ "బాబాకి జై" అవతార్ మెహెర్ బాబాకి జై అని ఆకాశం చిల్లుపడేలా బిగ్గరగా జయజయధ్వానాలు చేశారు. ఆ జయకారాలతో వారు సేద తీరారు. కొంతమంది రైలు దిగి బాబా దగ్గరకు వెళ్ళాలని ప్రయత్నించారు. ఐతే, వారి వారి బోగీలను వదిలి రావద్దని బాబా



**ఈస్ట్ వెస్ట్ గాథరింగ్‌లో**
**ప్రేమికులకు ఇచ్చిన బ్యాడ్జి**

సూచించడంతో వారు ఆ ప్రయత్నం విరమించుకున్నారు. అవతారుడి సప్తవర్ణ పతాకాన్ని పెద్దసైజు గల దాన్ని ఇంజనుకు ముందు ఎగురవేశారు. అలాగే చిన్న జెండాలను రైలు బోగీలకు అలంకరించారు. బోగీలకు బైట బాబా చిత్రపటాలను అతికించారు. సహవాస్ సమయంలో బాబా సందేశాలతో కట్టిన బ్యానర్లను కూడా రైలు బోగీలకు బైటవైపు కట్టి అందంగా అలంకరించారు. రైలు బయల్దేరడానికి గట్టిగా కూత పెట్టింది. ఇక బయల్దేరమని రైలు డ్రైవర్‌కి అవతారుడు తన రెండు చేతులు వూపుతూ సంకేతాలు ఇచ్చారు. అవతారుని జయ జయ ధ్వానాలతో బాబా ప్రేమ నిండిన హృదయాలతో సహవాసీలు తమ స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. "నేను ఆనందంగా వున్నాను. నన్ను మీతో తీసుకెళ్ళండని" బాబా సంజ్ఞలు చేస్తుంటే, సహవాసీలు చాలామంది తమ బోగీ గుమ్మాల దగ్గర, కిటికీలలోంచి తొంగి చూస్తూ అవతారుడ్ని కనుచూపు మేరలో దర్శించుకుంటూ బరువైన హృదయాలతో ముందుకు పయనమయ్యారు. రైలు బండి డోండ్ స్టేషన్‌వైపు వేగంగా ముందుకు దూసుకుపోతుంటే, మెహెరా, తదితర స్త్రీ మండలి వైపు చూస్తూ, వారందరూ తన ప్రేమను పదిమందికి పంచిపెట్టడానికి సిద్ధమయ్యారు. వారిక్కడ వుండగా ఆ స్ఫూర్తిని నా నుండి పొందారన్నారు బాబా. కొంతమంది మాత్రం ఆ రోజు రాత్రికి అహ్మద్‌నగర్ నుండి బయల్దేరి తమ స్వగ్రామాలకు వెళ్ళారు. మరికొందరు ఆ మర్నాడు ఉదయాన్నే బయల్దేరారు.

**ఈ అవతారకాలంలో 1955, 1958 సంవత్సరాలకు చాలా ప్రత్యేక స్థానం వుంది. ఈ సమయంలోనే మెహెరాబాద్‌లో రెండు సహవాస్‌లు నిర్వహించడమైంది. భిన్న భాషా ప్రాంతీయులు మెహెరాబాద్ పూదోటలో చక్కగా విహరించారు. వీరందరూ పరబ్రహ్మ, పరమాత్మ, దేవ దేవుడైన అవతారుని సన్నిధిలో ఓలలాడారు. ఈ సహవాస్‌లో పాల్గొన్న సహవాసీలందరూ ధన్యులు.**

**(ఇంతటితో ఈ ధారావాహిక సీరియల్ సమాప్తం)**

# ఈస్ట్ వెస్ట్ గాథరింగ్ 1962

## 2021 నవంబరు నుండి కొత్త ధారావాహిక సీరియల్ ప్రారంభం



1962 నవంబరు నుండి 5 వరకూ గురుప్రసాద్, పూణేలో తూర్పు–పశ్చిమ దేశాల నుండి వచ్చిన ప్రేమికులతో అపూర్వమైన సహవాస్ జరిగింది. **న భూతో న భవిష్యతి** అన్న చందాన జరిగిందీ సహవాస్. మానవాళి తమ జీవిత చక్రంలో ఇలాంటి సహవాస్‌ని ప్రప్రథమంగా చూశారు. ఈ సందర్భంగా, "నేను ఈ విశ్వానికి తండ్రిని. ఇక్కడ నివసించేవారందరూ తన బిడ్డలని" బాబా పిలుపు ఇచ్చారు. తూర్పు–పడమర అనే బేధం లేదన్నారు. భగవంతుడు ఒక్కడే సత్యం. బాబావారి ప్రవచించిన ఈ ఏకత్వాన్ని ఈ సహవాస్‌కి హాజరైన వారందరూ అనుభవించారు. ప్రపంచంలో వున్న అన్ని మతాలు, కులాలు, వర్గాలవారు సుమారు ఐదు వేలమంది ఈ సహవాస్‌లో పాల్గొన్నారు. అవతారుడు ఎత్తైన వేదిక మీద ఆసీనులై అందర్నీ తన దివ్యదర్శనంతో ఓలలాడించారు. వేలాదిమంది హాజరైన ఆ కార్యక్రమంలో **"బాబా ఒక్కరే అక్కడ వున్నారనే"** భావం ప్రతిఒక్కరికీ కలిగింది. అంతేకాదు, ప్రతిఒక్కరూ మెహెర్‌బాబా తనకేదో ప్రత్యేకంగా బహుమతి ఇస్తున్నారని భావించారు. ఇంతటి విశిష్టమైన తూర్పు–పశ్చిమ ప్రేమికుల సహవాస్ గురించి 2021 నవంబరు నుండి ధారావాహిక సీరియల్‌గా ప్రారంభించనున్నాం. ఆ సహవాస్‌కు సంబంధించిన అనేక అరుదైన విషయాలు ఈ తరం ప్రేమికులు తప్పక తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో, ఇంగ్లీషులో వున్న లార్డ్ మెహెర్ వాల్యూం –7 పేజి 4249 నుండి 4267 ఆధారంగా వినమ్రపూర్వకంగా తేటతెలుగు అనువాదంతో అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. ఈ సహవాస్‌లో అవతారుడు ఇచ్చిన సందేశాలు నేటి తరానికి మార్గదర్శకం కావాలి!! ఈ శీర్షికపై ఎప్పటికప్పుడు మీ స్పందన తెలియజేయగలరు. – **ఎడిటర్**

# నరపేలో బాబా 128వ జన్మదినోత్సవాలు

**2021 అక్టోబరు 15 నుండి 2022 ఫిబ్రవరి 25 వరకూ**

నరసరావుపేటలో అవతారుని 128వ జన్మదిన వేడుకలు 2021 అక్టోబరు 15 నుండి ప్రారంభిస్తున్నట్లు శ్రీ అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు. బాబావారి జన్మదిన వేడుకలలో ప్రతిరోజూ ఒక్కొరి ఇంట సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలు 2022 ఫిబ్రవరి 25 వరకూ, 128 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు శ్రీ అచ్యుతరావు తెలిపారు. గత అర్ధ శతాబ్దికి పైగా నరసరావుపేట బాబా కేంద్రంలో ప్రతి ఏటా అవతారుని జన్మదినవేడుకలను ఎంతో వేడుకగా జరుపుకుంటున్నట్లు సమాచార భోగట్టా.

# మెహెర్ నవరాత్రులు

నరసరావుపేట బాబా కేంద్రంలో 2021 అక్టోబరు 7 నుండి 15 వరకూ ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి 8.30 వరకూ మెహెర్ నవరాత్రులు నిర్వహించామని శ్రీ వంకాయల అచ్యుతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# చల్లపల్లి

2021 సెప్టెంబరు 5, ఆదివారం ఉదయం 5:30 నుండి 7 వరకు ఏక నామం శ్రీమతి జయలక్ష్మి, శ్రీ నాళం నరసింహారావు గారి కుటుంబ సభ్యులచే నిర్వహించినట్లు కార్యదర్శి శ్రీ పి.వి.రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# వరుడు కావాలి

యం.బి.బి.యస్ పూర్తిచేసి, గాంధీ ఆసుపత్రి, హైదరాబాద్‌లో యం.డి. చేస్తున్న వధువుకి తగిన వరుడు కావాలని శ్రీ ఆవుల చంద్రమోహన్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. వరుడు వైద్య వృత్తి, లేదా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా వుండాలని, బాబా ప్రేమిక కుటుంబంలో వుండి వుంటే మరింత ఆనందదాయకమన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ ఆవుల చంద్రమోహన్ యాదవ్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్‌ను సంప్రదించవల్సిందిగా (9052677549) కోరుతున్నారు.

## పుస్తక సమీక్ష

**కొత్తగా ప్రచురించిన బాబా సాహిత్య గ్రంథాలను, పుస్తక సమీక్ష కోరువారు ఆ పుస్తక రెండు ప్రతులను మెహెర్‌బాబా పత్రిక చిరునామాకు పంపగలరు.**

## పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహా ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

## మండలి ప్రార్థన

ప్రియ దైవమా!
నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**

## జీవిత సభ్యత్వం

2021 అక్టోబరు నెలలలో పంపిన వారి వివరాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ బి. నాగేశ్వర్‌రావు, నర్సరావుపేట, గుంటూరుజిల్లా | రూ. 1000/- |
| 2. | శ్రీ శరత్‌చంద్ర, నర్సరావుపేట, గుంటూరుజిల్లా | రూ. 1000/- |
| 3. | శ్రీమతి పుష్ప, పిడుగురాళ్ళ, గుంటూరుజిల్లా | రూ. 1000/- |
| 4. | శ్రీమతి అంకాతి భారతి, వెంకట్‌రావుపేట, మంచిర్యాల | రూ. 500/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**If undelivered please return to:**
**The Editor, Meher Baba Magazine, Godavari Gardens, Plot No: 32**
**BABA'S HOUSE, YAPRAL,**
**J.J. NAGAR POST OFFICE**
**SECUNDERABAD - 500 087**
**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**